

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:102 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 02-11-2026 | పేజీలు: 10

సిరా చుక్క

మారాలి వ్యవస్థ.. మారాలి చట్టం!
హింసను హీరోయిజంగా చూపే
సినిమాలు.. సమాజానికి
శాపమవుతున్నాయా?
మద్యం, మాదకద్రవ్యాల మత్తులో
మానవత్వం మంటగలుస్తోందా?
చట్టాలంటే భయం లేని పరిస్థితులు
నేరాలకు ప్రోత్సాహమిస్తున్నాయా?
ప్రజలను కాపాడాల్సిన పోలీసు వ్యవస్థ..
రాజకీయ సేవలో మునిగిపోతోందా?
రక్షకులే నాయకుల భజనలో ఉంటే..
సామాన్యుడికి దిక్కెవరు?
జీతమిచ్చే ప్రజల రక్షణే
పోలీసుల ప్రథమ కర్తవ్యం కావాలి!
చట్టాలు కఠినంగా మారాలి..
నేరగాళ్ల గుండెల్లో భయం పుట్టాలి!
అధికారం ముందు కాదు..
ప్రజల ముందు తలవంచే వ్యవస్థ రావాలి!
ఇకనైనా మేల్కొనాలి సమాజం..
మార్పు రావాలి పాలనలో!

అరుణ్ రెడ్డి పన్నాల ,
వికారాబాద్ జిల్లా బ్యూరో చీఫ్



ఓటు చోరీపై ఢిల్లీలో ప్రతిపక్ష మహాగర్జన

- రాహుల్ గాంధీ నేతృత్వంలో 'చలో ఢిల్లీ' దండయాత్ర
- రాంలీలా మైదానంలో లక్షలాది మంది హాజరు
- సీఈసీ రాజీనామాకు ఇండియా కూటమి డిమాండ్
- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నినాదాలు

ప్రజా వాయిస్,న్యూఢిల్లీ. దేశ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో నిర్వహించిన 'చలో ఢిల్లీ' దండయాత్రతో దేశ రాజధాని రాజకీయంగా వేడెక్కింది. మింటో రోడ్ నుంచి రాంలీలా మైదానం వరకు సాగిన ఈ ర్యాలీలో రాహుల్ గాంధీతో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను ప్రతిపక్షాలు బలంగా వినిపించాయి.



ఓటు హక్కు కోసం రణభేరి.

మింటో రోడ్ నుంచి రాంలీలా మైదానం వరకు సాగిన పాద యాత్రలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీల కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. చేతుల్లో జెండాలు, ప్లకార్డులు పట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని నేతలు పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ఘాటు వ్యాఖ్యలు..

రాంలీలా మైదానంలో జరిగిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఓటు చోరీ అనేది సాధారణ దొంగతనం కాదని, దేశ ప్రజల గొంతుకను దొంగిలించడమేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల ఓటు హక్కులకు భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.



ఒకే వేదికపై జాతీయ నేతలు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వి యాదవ్, ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితర

మిగతా 2లో

ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల బలి

- అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం!
- పాలం చుట్టూ మృత్యు తీగలు కడుతున్నా
- కానరాని అధికారులు
- ఫలితంగా రెండు ఇళ్లలో నవ్వులు మాయమై.. జీవితాంతం తీరని కన్నీళ్లు మిగిలాయి!
- విద్యుత్, రెవెన్యూ, పోలీస్ శాఖల పర్యవేక్షణపై ప్రశ్నలు
- కలెక్టర్ గారూ.. జిల్లావ్యాప్తంగా వ్యవసాయ క్షేత్రాల్లో ప్రమాదకర విద్యుత్ కంచెలపై ప్రత్యేక తనిఖీలకు శ్రీకారం చుట్టాలి
- ప్రమాదం తర్వాత స్పందించే పాలన కాదు.. ప్రమాదాన్ని ముందే నివారించే పాలన కావాలి!

2 లో

కాళేశ్వరంలో 20 వేల క్యూసెక్కుల నీళ్లు పారుతున్నా ఎత్తడం లేదు!

- రైతులకు నీళ్లివ్వాలనే ఆలోచన రేవంత్ రెడ్డికి లేదు
- యూరియా, పంట కొనుగోళ్లు, బోనస్ ఎగ్గొట్టేందుకే సాకులు చెబుతున్నారు
- కేసీఆర్ ప్రాజెక్టులను వినియోగిస్తే ఒక్క మండలంలోనూ కరువు వచ్చేది కాదు
- ఆదిలాబాద్ రైతు గర్జన సభలో మాజీ మంత్రి కేటీఆర్ ఘాటు విమర్శలు




ప్రజా వాయిస్,ఆదిలాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ఆదివారం రోజున కూడా 20 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయని, కావాలంటే ఇప్పటికీ ఆ నీటిని ఎత్తి రైతులకు అందించవచ్చని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీటిని ఎత్తే ఆలోచనే లేదని విమర్శించారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు అందిస్తే యూరియా సరఫరా చేయాల్సి ఉంటుందని, పంటలను కొనుగోలు చేయాలని, పంట బోనస్ చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతలన్నింటినీ తప్పించుకునేందుకే ప్రభుత్వం కరెంట్ లేదు, నీళ్లు లేవంటూ సాకులు చెబుతోందని ఆరోపించారు.ఎల్‌నినో అనేది ఓ బక్వాస్ ముచ్చట అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకొని ఉంటే రాష్ట్రంలోని ఒక్క మండలంలో కూడా కరువు పరిస్థితులు ఏర్పడేవి కావని

మిగతా 2లో

నేడు తెలంగాణకు అమిత్ షా

- హైదరాబాద్‌లో బీజేపీ మహా పాదయాత్ర
- ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో భారీ కార్యక్రమం
- బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర
- ఎంజే మార్కెట్‌లో బహిరంగ సభ
- రాష్ట్ర రాజకీయాలపై అమిత్ షా ప్రసంగంపై ఆసక్తి

2 లో



బాల్యం బలైపోతోందా.. బడుల్లో బుసలు కొడుతున్న హింస

- పుస్తకాలు పట్టాల్సిన చేతుల్లో రాళ్లు
- ఆటపాటల వయసులోనే దాడులు, వేధింపులు
- పంచకులా ఘటనతో దేశవ్యాప్తంగా చర్చ
- పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు
- సోషల్ మీడియా ప్రభావం, కుటుంబ వాతావరణం, మానసిక ఒత్తిళ్లపై ఆందోళన
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాల బాధ్యతపై సర్వత్రా చర్చ



ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం,హైదరాబాద్: బాల్యం అంటే ఆట పాటలు.. చదువులు.. అల్లరి.. అందమైన జ్ఞాపకాలు. కానీ నేటి పరిస్థితుల్లో కొన్ని ఘటనలు బాల్యాన్ని భయాందోళనల మధ్యకు నెట్టేస్తున్నాయి. చిన్నారుల చేతుల్లో పుస్తకాలు ఉండాల్సిన వయసులో హింసాత్మక ప్రవర్తన కనిపించడం సమాజాన్ని కలవరపెడుతోంది. హర్యానాలోని పంచకులాలో ఎనిమిదేళ్ల బాలుడు ఆరేళ్ల చిన్నారిపై దాడికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది ఒక్క పాఠశాలకు సంబంధించిన ఘటన మాత్రమే కాదు.. పిల్లల పెంపకం, కుటుంబ వాతావరణం, సోషల్ మీడియా వినియోగం, పాఠశాలల పర్యవేక్షణపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది.దేశంలోని వివిధ ప్రాంతాల్లో పాఠశాలల్లో విద్యార్థుల మధ్య దాడులు, వేధింపులు, హాస్టళ్లలో హింస, బయటి వ్యక్తుల దాడులు వంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. జార్ఖండ్‌లో తోటి విద్యార్థిపై

మిగతా 2లో

పంట చేతికొచ్చే వేళ.. తుపాను గండం

- 'అర్నబ్' తర్వాత 'మురసు' కలవరం
- తెలంగాణకు నాలుగు రోజుల వర్ష సూచన
- ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్
- వరి, పత్తి రైతుల్లో ఆందోళన
- ధాన్యం తడిస్తే నష్టాలే
- అప్రమత్తతే శ్రీరామరక్ష

2 లో



పెట్టుబడుల పేరుతో రూ.2.01 కోట్ల టోకరా

- భారీ లాభాల ఆశ చూపి పుణెలో వృద్ధుడికి సైబర్ నేరగాళ్ల వల
- ముఖేశ్ అంబానీ, సచిన్ టెండుల్కర్ పేర్లతో నకిలీ ప్రకటనలు
- క్రిప్టో కరెన్సీ, బంగారంలో పెట్టుబడులంటూ ఆకర్షణ
- తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు వస్తాయంటూ నమ్మబలికిన కేటుగాళ్లు.
- విడతల వారీగా వృద్ధుడి నుంచి కోట్లు కాజేసిన ముఠా.
- పెట్టుబడుల పేరుతో మొదలైన మోసం.
- డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు.

2లో



- పోలీసులమంటూ భయపెట్టి మరింత డబ్బు వసూలు చేసేందుకు యత్నం.
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పుణె సిటీ సైబర్ పోలీసులు
- సైబర్ నేరగాళ్ల మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక..

ఓటు చోరీపై ఢిల్లీలో ప్రతిపక్ష మహాగర్జన

మొదటి పేజీ తరువాయి

నాయకులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులు ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల హక్కుల పరిరక్షణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఎస్ఐఆర్‌పై రాజకీయ దుమారం

ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే నకిలీ, డూప్లికేట్, అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకే ఎస్ఐఆర్ చేపట్టామని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.



దేశ రాజకీయాల్లో చర్చనీయాంశం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను మరోసారి తెరపైకి తెచ్చిన ఈ ర్యాలీతో ఢిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల సంఘం తీరుపై ప్రతిపక్షాల పోరాటం భవిష్యత్తులో ఏ మలుపు తిరుగుతుందన్ది రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

పంట చేతికొచ్చే వేళ.. తుపాను గండం

ప్రజా వాయిస్,హైదరాబాద్.ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే వేళ ప్రకృతి రైతుకు పరీక్ష పెట్టేందుకు సిద్ధమవుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 'మురసు' తుపానుగా బలపడే సూచనలు కనిపిస్తుండటంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు మరో తుపాను హెచ్చరిక కలవరపెడుతోంది. నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు తెలంగాణలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయడంతో వ్యవసాయ వర్గాల్లో అప్రమత్తత నెలకొంది. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట, కల్లాల్లో ఉన్న ధాన్యం, పత్తి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

బంగాళాఖాతంలో తుపాను కదలికలు..

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది మరింత తీవ్రరూపం దాల్చవచ్చని అంచనా వేస్తోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం నవంబర్ 3న నెల్లూరు, నరసాపురం మధ్య దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. తుపాను ప్రభావం ఏపీతో పాటు తెలంగాణపైనా పడే అవకాశం ఉంది.

రైతు కష్టానికి ప్రకృతి పరీక్ష.

ప్రస్తుతం వరి కోతలు, పంట సేకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వర్షాల సూచన రైతులను కలవరపెడుతోంది. పంట చేతికొచ్చే సమయంలో వర్షం పడితే ధాన్యం తడిసి నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే కోసిన పంటను కల్లాల్లో ఆరబెట్టుకుంటున్న రైతులకు మరింత ఇబ్బంది ఎదురుకావచ్చు. ధాన్యం తడిస్తే ఆరబెట్టడం, నిల్వ చేయడం, కొనుగోలు కేంద్రాలకు తరలించడం భారంగా మారుతుంది. దీంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కల్లాల్లో ధాన్యం..
కాపాడుకోవడం సవాలే..

వరి రైతులు కోసిన ధాన్యాన్ని వర్షానికి వదిలేయకుండా టార్పాలిన్లతో పూర్తిగా కప్పాలి. కల్లాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కూడా తడవకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలి. తేమ కారణంగా ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పత్తి రైతులకు మరో దెబ్బ..

పత్తి తీత కొనసాగుతున్న ప్రాంతాల్లో వర్షాలు పడితే పత్తి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. తడిసిన పత్తికి మార్కెట్‌లో ధర తగ్గే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సేకరించిన పత్తిని తేమ తగలకుండా నిల్వ చేయాలి. వర్షం తగ్గిన తర్వాత పత్తిని పూర్తిగా ఆరబెట్టిన అనంతరమే నిల్వ చేయడం మంచిది.

మిర్చి, కూరగాయల సాగుపైనా ప్రభావం..

అధిక వర్షాలతో పొలాల్లో నీరు నిల్వ ఉంటే మిర్చి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వేర్లు కుళ్లడం, తెగుళ్లు వ్యాపించడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. రైతులు పొలాల్లో మురుగు నీటి పారుదలకు ఏర్పాట్లు చేసుకోవాలి. వర్షాల సమయంలో పురుగుమందుల పిచికారీ చేయకూడదు.

ఉమ్మడి జిల్లాల్లో అప్రమత్తత..

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ కావడంతో రైతులు వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనించాలి. అరటి, బొప్పాయి వంటి పంటలకు గాలుల వల్ల నష్టం కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి. పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి. రైతులు ఉరుములు, మెరుపుల సమయంలో పొలాల్లో ఉండకూడదు.

కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు ఏవీ..

వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు ముందుగానే టార్పాలిన్లు, ధాన్యం నిల్వకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిస్తే రైతులకు అదనపు కష్టాలు తప్పవు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలి. పంట నష్టం జరిగితే వెంటనే అంచనా వేసేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలి.

అన్నదాతకు ముందస్తు హెచ్చరిక..

చేతికొచ్చిన పంటను కాపాడుకోవడమే ఇప్పుడు రైతుల ముందున్న ప్రధాన లక్ష్యం. వాతావరణ శాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా ధాన్యం, పత్తిని సురక్షితంగా భద్రపరచుకోవాలి. తుపాను ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. అయితే ప్రకృతి విపత్తు నష్టంగా మారకముందే రైతులు, అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

రామ్ మందిర్ విరాళాలపై సుప్రీంకోర్టు విచారణ

- **సీల్డ్ కవర్‌లో సిట్ నివేదిక!**
- **నిధుల వినియోగంపై పారదర్శకతకు పిటిషనర్ల డిమాండ్**
- **ఫోరెన్సిక్ ఆడిట్‌కు పట్టుబాటు**

ప్రజా వాయిస్,అయోధ్య: అయోధ్య రామమందిర ట్రస్ట్‌కు అందిన విరాళాలు, వాటి నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు సుప్రీంకోర్టుకు చేరాయి. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది. భక్తులు సమర్పించిన విరాళాల వినియోగంలో పారదర్శకత ఉండేలా కోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పిటిషనర్లు కోరుతున్నారు. ముఖ్యంగా నిధుల లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన నివేదికను సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించింది. సీసీటీవీ ఫుటేజీల పరిశీలనలో 105 దొంగతనాల ఘటనలు వెలుగులోకి వచ్చినట్లు సిట్ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో భద్రత, విరాళాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.గతంలోనే ఈ కేసు దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా భాగస్వామ్యం చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తాజాగా జరగనున్న విచారణలో సిట్ సమర్పించిన నివేదికలోని అంశాలు, పిటిషనర్ల అభ్యర్థనలు కీలకంగా మారనున్నాయి. అయితే నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు రావడం, అవి నిరూపితమవడం వేర్వేరు అంశాలు. కోర్టు విచారణలో వెలువడే వివరాలతో ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నేడు తెలంగాణకు అమిత్ షా

ప్రజా వాయిస్,హైదరాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం తెలంగాణలో పర్యటించనున్నారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ బీజేపీ నిర్వహించనున్న మహా పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. రాష్ట్రంలో బీజేపీ రాజకీయ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్న అమిత్ షా, అక్కడి నుంచి ఐటీసీ కాకతీయ హోటల్‌కు వెళ్లనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి మహా పాదయాత్రలో పాల్గొంటారు. 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం) నినాదంతో చేపట్టనున్న ఈ యాత్ర అబిడ్స్ మీదుగా మొజాంజాహీ మార్కెట్ వరకు కొనసాగనుంది. సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల మధ్య ఎంజే మార్కెట్ వద్ద నిర్వహించే సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు. సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొననున్నారు. మరోవైపు అమిత్ షా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ వాతావరణం వేడెక్కింది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ఓటు చోరీ వ్యతిరేక సభకు మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ ఈ పాదయాత్ర చేపడుతుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్ఐఆర్‌పై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కొనసాగుతున్న విమర్శలు, ఆరోపణలకు హైదరాబాద్ వేదికగా అమిత్ షా ఎలాంటి సమాధానం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

డిజిటల్ చెల్లింపుల్లో సరికొత్త రికార్డు!

- **రోజుకు రూ.లక్ష కోట్లకు పైగా లావాదేవీలు**
- **అక్టోబర్‌లో రూ.31.53 లక్షల కోట్ల చెల్లింపులు**
- **సెప్టెంబర్‌తో పోలిస్తే 7.4 శాతం వృద్ధి**
- **పండుగల కొనుగోళ్లతో పెరిగిన యూపీఐ వినియోగం**
- **నగదు రహిత లావాదేవీల వైపు ప్రజల మొగ్గు**

ప్రజా వాయిస్,న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అక్టోబర్ నెలలో యూపీఐ (UPI) లావాదేవీలు భారీగా పెరిగాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం రోజువారీ సగటు లావాదేవీల విలువ తొలిసారిగా రూ.లక్ష కోట్ల మార్కును అధిగమించింది. నెలవారీగా మొత్తం లావాదేవీల విలువ రూ. 31.53 లక్షల కోట్లకు చేరుకుంది. సెప్టెంబర్‌తో పోలిస్తే లావాదేవీల సంఖ్య 5.8 శాతం, చెల్లింపుల విలువ 7.4 శాతం మేర వృద్ధి చెందాయి. పండుగల సీజన్ నేపథ్యంలో ప్రజలు పెద్దఎత్తున కొనుగోళ్లు చేపట్టడం, నగదు చెల్లింపు ల కంటే డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వడం ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. చిన్న దుకాణాల నుంచి షాపింగ్ మాల్స్ వరకు క్యూఆర్ కోడ్ స్కానింగ్ చెల్లింపులు చేయడం సాధారణమైంది.

విదేశీ ప్రయాణికులకూ డిజీ యాత్ర సేవలు!

- **7 ప్రధాన విమానాశ్రయాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభం**
- **2027 నాటికి దేశవ్యాప్త అమలుకు కేంద్రం ప్రణాళిక**

ప్రజా వాయిస్,హైదరాబాద్: విమాన ప్రయాణికులకు విమానాశ్రయాల్లో తనిఖీల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ డిజీ యాత్ర సేవలను అంతర్జాతీయ ప్రయాణికుల కోసం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. దేశంలోని హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ఏడు ప్రధాన విమానాశ్రయాల్లో ఈ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఈ-పాస్‌పోర్ట్ కలిగిన భారతీయులు ఎయిర్ ఇండియా, ఇండిగో విమానాల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. డిజీ యాత్ర విధానం ద్వారా ప్రయాణికుల ముఖ గుర్తింపు సాంకేతికత ఆధారంగా విమానాశ్రయ ప్రవేశం, తనిఖీల ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ సేవలను 2027 నాటికి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

కాళేశ్వరంలో 20 వేల క్యూసెక్కుల నీళ్లు పారుతున్నా ఎత్తడం లేదు!

మొదటి పేజీ తరువాయి

అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

చంద్రబాబు కుప్పానికి నీళ్లు తీసుకెళ్లారు..

రేవంత్ చేయలేకపోయారుచంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన కుప్పం ప్రాంతానికి నీటిని తీసుకెళ్లారని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో నల్లమల పులి అని చెప్పుకునే రేవంత్ రెడ్డి మాత్రం పక్కనే ఉన్న పాలమూరు పరిధిలో 12 టీఎంసీల నీటిని కూడా ఎత్తలేకపోయారని విమర్శించారు. నీటి వనరులు, ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నా రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

చనాక-కొరాట ప్రాజెక్టును
పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

ఆదిలాబాద్ ప్రాంత రైతులకు సాగునీరు అందించే చనాక-కొరాట ప్రాజెక్టు దశాబ్దాల కల అని, ఆ ప్రాజెక్టును తామే పూర్తి చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ప్రాజెక్టు కాలువలు తవ్వించే పనులు కూడా చేపట్టలేకపోయిందని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా కాలువల పనులు చేపట్టకపోవడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదని అన్నారు.

మూడేళ్లలో కాళేశ్వరం కట్టిన కేసీఆర్..
అపాయింట్‌మెంట్‌కే మూడేళ్లు

తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ పొందడానికే కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడేళ్లు పట్టిందని విమర్శించారు. అదే కేసీఆర్ మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని గుర్తుచేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకొని రైతులను ఆదుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల బలి

మొయినాబాద్ (ప్రజావాయిస్): ఒక ఎకరం పంట నష్టపోతే రైతుకు ఆర్థిక నష్టం. కానీ ఒక మనిషి ప్రాణం పోతే ఏకంగా ఒక కుటుంబానికే జీవిత కాల నష్టం. ఈ రెండింటి మధ్య తేడా అర్థం చేసుకోలేని సమాజం నాగరిక సమాజం ఎలా అవుతుంది? పంటను కాపాడుకోవాల్సిన కంచె ఇద్దరు ఇంజనీరింగ్ (కేజీరెడ్డి కళాశాల)విద్యార్థులు మోక్ష చరణ్ (20),యశ్వంత్ (20)ప్రాణాలను బలిగొంది. అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవాలనే పేరుతో వ్యవసాయ క్షేత్రం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఇద్దరు యువకుల పాలిట మృత్యుపాశాల య్యాయి. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి. కానీ ఇక్కడ ప్రశ్న కేవలం కరెంట్ కంచె ఏర్పాటు చేసిన వ్యక్తి గురించే కాదు. ఇలాంటి ప్రమాదకర కంచెలు ఏర్పడకుండా చూడాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తోంది? ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన శాఖలు ఎక్కడ నిద్రపోతున్నాయి?అని సభ్య సమాజం ప్రశ్నిస్తోంది.



అభివృద్ధి చెందుతున్న సమాజంలో
ఇంకా ఈ మృత్యుకంచెలా?

చంద్రుడిపైకి ప్రయాణిస్తున్నాం. సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచంతో పోటీ పడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ మన గ్రామాల్లో ఒక వ్యవసాయ క్షేత్రం చుట్టూ ప్రమాదకర విద్యుత్ తీగలు ఉన్నాయో లేదో గుర్తించే పర్యవేక్షణ వ్యవస్థను కూడా సమర్థంగా అమలు చేయలేకపోతున్నామా? ఆధునికత అంటే రహదారులు, భవనాలు, పరిశ్రమలు మాత్రమే కాదు. మనిషి ప్రాణానికి భద్రత కల్పించగలగడం కూడా అభివృద్ధిలో భాగమే అన్న విషయం మర్చిపోకూడదు. ఒక పొలంలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వ్యక్తిగత చర్య కావచ్చు. కానీ అలాంటి ప్రమాదాలను గుర్తించి అరికట్టేందుకు వ్యవస్థ పనిచేయకపోవడం మాత్రం పరిపాలనా బాధ్యతకు నిలువుటద్దంగా మారింది.

కలెక్టర్ గారూ.. మీరైనా స్పందించండి!

ఇద్దరు విద్యార్థుల మరణాన్ని ఒక సాధారణ ప్రమాదంగా చూడకండి. జిల్లాలోని ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో వ్యవసాయ పొలాల చుట్టూ ప్రమాదకర విద్యుత్ కంచెలు ఉన్నాయా లేదా వెంటనే ప్రత్యేక తనిఖీలు చేయించండి. విద్యుత్, రెవెన్యూ, పోలీసు శాఖలతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేయండి. ఎక్కడైనా ఇలాంటి కంచెలు ఉంటే చట్టప్రకారం తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోండి. రైతులకు పంట రక్షణ కోసం సురక్షితమైన ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించండి.రెండు కుటుంబాల్లో ఆరిపోయిన ఆశాదీపాలు మళ్లీ వెలగవు. బిడ్డలు చదువుకుని ప్రయోజకులవుతారని కలలు కన్న తల్లిదండ్రులకు ఇప్పుడు మిగిలింది జీవితాంతం తీరని వేదనే. ఆ కన్నీళ్లకు పరిహారం ఎంత ఇచ్చినా ప్రత్యామ్నాయం కాదు. కనీసం వారి మరణం మరో కుటుంబానికి ఇలాంటి దుస్థితి రాకుండా చేసే మార్పుకు కారణం కావాలి.అధికారులు ఇప్పటికైనా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. ప్రజల ప్రాణాలు పోయాక విచారణ చేయడం కంటే, ప్రాణాలు పోకుండా ముందే అడ్డుకోవడం ఎంతో ముఖ్యం. ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శించడం పాలన కాదు.. ప్రమాదమే జరగకుండా చూడటమే నిజమైన బాధ్యతని మరిచిపోవద్దు.

పెట్టుబడుల పేరుతో రూ.2.01 కోట్ల టోకరా

ప్రజా వాయిస్, హైదరాబాద్.పెట్టుబడులపై భారీ లాభాలు వస్తాయంటూ ఆశ చూపించి ఓ వృద్ధుడి నుంచి సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.2.01 కోట్లను కాజేసిన ఘటన పుణెలో వెలుగుచూసింది. వెంచర్ క్యాపిటల్ సంస్థ పేరుతో నకిలీ ప్రకటనలు రూపొందించి, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్, మాజీ మంత్రి చిదంబరం పేర్లను ప్రమోటర్లుగా పేర్కొంటూ బాధితుడిని ఆకర్షించారు. ఆ ప్రకటన చూసిన వృద్ధుడు నిందితులను సంప్రదించగా, తమ సంస్థ బ్రిటన్‌లో ఉందని నమ్మించారు. కేవలం రూ.20 వేల పెట్టుబడికి వారంలోనే రూ.80 వేల రాబడి వస్తుందని ఆశ చూపారు. తొలుత చెప్పినట్లుగానే వృద్ధుడికి పెట్టుబడి నాలుగింతలైనట్లు నకిలీ ఖాతా వివరాలు పంపించి నమ్మకం కలిగించారు. దీంతో బాధితుడు లాభాల ఆశతో విడతలవారీగా క్రిప్టోకరెన్సీ, బంగారం తదితర పెట్టుబడుల పేరుతో వివిధ బ్యాంకు ఖాతాలకు రూ.1.03 కోట్లు బదిలీ చేశారు. అనంతరం తన పెట్టుబడి, లాభాలను వెనక్కి తీసుకోవాలని కోరగా మరో రూ.13.5 లక్షలు చెల్లిస్తేనే నగదు తిరిగి వస్తుందని నిందితులు చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించారు. ఇంతటితో ఆగని సైబర్ నేరగాళ్లు ట్రాయ్ అధికారులమంటూ మరోసారి ఫోన్ చేసి, మనీలాండరింగ్ కేసులో బాధితుడి బ్యాంకు ఖాతా పేరు నమోదైందని బెదిరించారు. ఖాతా వెరిఫికేషన్ పూర్తయ్యే వరకు డిజిటల్ అరెస్టులో ఉన్నారని, ఎవరికీ ఈ విషయం చెప్పవద్దని హెచ్చరించారు. పోలీస్ క్లియరెన్స్ పేరుతో బ్యాంకులోని మిగిలిన సొమ్మును కూడా తాము సూచించిన ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. ఈ విషయం బయటకు చెబితే ఈడీ అధికారులు అరెస్టు చేస్తారని భయపెట్టారు. చివరకు తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా నిందితులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయారు. దీంతో బాధితుడు పుణె సిటీ సైబర్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల ఆచూకీ, నగదు బదిలీ అయిన బ్యాంకు ఖాతాల వివరాలపై దర్యాప్తు చేపట్టారు.



బాల్యం బలైపోతోందా.. బడుల్లో బుసలు కొడుతున్న హింస

మొదటి పేజీ తరువాయి

బెల్టులతో దాడి చేసి వీడియో చిత్రీకరించిన ఘటన.. కర్ణాటకలో హాస్టల్‌లో జరిగిన ప్రాణాంతక దాడి.. కేరళలో విద్యార్థిపై మూకుమ్మడి దాడి.. ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలలోకి చైన్సాతో ప్రవేశించి విద్యార్థినిపై దాడి చేసిన ఘటనలు విద్యాసంస్థల్లో భద్రతపై ఆందోళన పెంచుతున్నాయి. ప్రతి ఘటనకు కారణాలు వేర్వేరైనా పిల్లల రక్షణ విషయంలో నిర్లక్ష్యానికి తావులేదనే విషయాన్ని ఇవి గుర్తుచేస్తున్నాయి.

చిన్న వయసులోనే హింసాత్మక ధోరణులెందుకు?

పిల్లల్లో దూకుడు ప్రవర్తనకు ఒక్క కారణమే ఉండదు. కుటుంబంలో గొడవలు, హింసాత్మక వాతావరణం, తోటి పిల్లల ప్రభావం, వేధింపులు, మానసిక ఒత్తిడి, భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి అనేక అంశాలు ప్రభావం చూపవచ్చు. పిల్లలు చూసే దృశ్యాలు, వినే మాటలు, అనుభవించే పరిస్థితులు వారి ప్రవర్తనపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చిన్నప్పుడే కనిపించే కోపం, ఇతరులను బాధపెట్టే ధోరణిని అల్లరిగా కొట్టిపారేయకుండా కారణాలను గుర్తించాలి.

చేతిలో మొబైల్..
మనసులో హింసాత్మక ఆలోచనలా?

డిజిటల్ ప్రపంచం పిల్లలకు విజ్ఞానాన్ని అందిస్తున్నప్పటికీ, అదే సమయంలో నియంత్రణలేని కంటెంట్ ప్రమాదకరంగా మారుతోంది. హింసాత్మక వీడియోలు, కొట్టుకోవడాన్ని ప్రోత్సహించే దృశ్యాలు, ఆన్‌లైన్ గేమ్స్‌లోని దూకుడు అంశాలు పిల్లలపై ప్రభావం చూపవచ్చు. అయితే ప్రతి ఘటనకు సోషల్ మీడియానే కారణమని నిర్ధారించలేం. పిల్లలు ఏం చూస్తున్నారు? ఎంతసేపు ఫోన్ వినియోగిస్తున్నారు? వారి ఆన్‌లైన్ ప్రపంచంలో ఎలాంటి పరిచయాలు ఉన్నాయి? అనే అంశాలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి.

పాఠశాలల్లో భద్రతకు పెద్దపీట వేయాలి

విద్యార్థుల భద్రత పాఠశాలల ప్రధాన బాధ్యతల్లో ఒకటి. తరగతి గదులు, ఆటస్థలాలు, కారిడార్లు, హాస్టళ్లలో తగిన పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థుల మధ్య వేధింపులు, బెదిరింపులు, దాడులపై ఫిర్యాదు చేసే వ్యవస్థ ఉండాలి. ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపిస్తే తల్లిదండ్రులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ కల్పించాలి. పాఠశాలల్లో భద్రతా నిబంధనలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలుకావాలి.

శిక్ష ఒక్కటే పరిష్కారం కాదు

హింసకు పాల్పడిన పిల్లలను నేరస్థులుగా ముద్ర వేయడం సమస్యకు పరిష్కారం కాదు. బాధిత చిన్నారులకు వైద్యంతో పాటు మానసిక భరోసా కల్పించాలి. దాడికి పాల్పడిన బాలల ప్రవర్తన వెనుక కారణాలను నిపుణులతో విశ్లేషించాలి. వయసుకు తగిన మార్గదర్శనం, కౌన్సెలింగ్ అందించాలి. అదే సమయంలో బాధితుల భద్రత, న్యాయం విషయంలో రాజీ పడకూడదు.

తల్లిదండ్రుల పాత్రే కీలకం

పిల్లలకు మంచి చదువు, ఖరీదైన ఫోన్లు, సౌకర్యాలు కల్పించడం మాత్రమే పెంపకం కాదు. ప్రేమ, మానవత్వం, సహనం, క్రమశిక్షణ, ఎదుటివారిని గౌరవించే గుణాలను నేర్పించాలి. రోజూ పిల్లలతో మాట్లాడాలి. వారి సమస్యలను వినాలి. కోపం, ఒంటరితనం, భయం, ఇతరులను వేధించే ప్రవర్తన కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా నిపుణుల సహాయం తీసుకోవాలి.

బాల్యం భద్రంగా ఉంటేనే భవిష్యత్తు భద్రం


పిల్లల భవిష్యత్తును కేవలం మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షలతో కొలవలేం. మంచి మనిషిగా ఎదగడానికి అవసరమైన విలువలను నేర్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వాలు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలి. పాఠశాలల్లో భద్రత, కుటుంబాల్లో ఆత్మీయత, సమాజంలో మానవత్వం పెంపొందినప్పుడే ఇలాంటి ఘటనలను నివారించే దిశగా ముందుకు వెళ్లగలం.చిన్నారుల చేతుల్లో పుస్తకాలు ఉండాలి.. వారి మనసుల్లో మానవత్వం నిండాలి. బాల్యాన్ని హింసక

అప్పుడే పుట్టిన శిశువు వదిలివేత

- ఐసిడిఎస్, సి డబ్ల్యూ సి అధికారులకు సమాచారం...



ప్రజా వాయిస్, పాపన్నపేట పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చాన్ పల్లి తండా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగ శిశువును వదిలి వెళ్లారు. పిల్ల వెనుక శిశువును గుర్తించిన తండావాసులు పోలీసులకు మరియు ఐసిడి ఎస్, సి డబ్ల్యూ సి అధికారులకు సమాచారం అందించారు. అధికారులు శిశువును మెదక్ మాత శిశు కేంద్రానికి తరలించి అక్కడ నుంచి నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు



మూలమలుపులో మృత్యుగుంత.!

- హుజూర్ నగర్ సర్వీస్ రోడ్డుపై ప్రమాద ఘంటికలు
- భారీ గుంతతో అస్తవ్యస్తంగా మారిన వాహనాల రాకపోకలు
- గుంతను తప్పించుకునే క్రమంలో నేరుగా దూసుకొస్తున్న వాహనాలు
- అండర్ పాస్ వద్ద తప్పని ప్రమాద భయం..
  తృటిలో తప్పిన పెను ప్రమాదం
- డీసీఎం ఢీకొట్టేంత దగ్గరకు రావడంతో వాహనదారుడి ఆందోళన

ప్రజా వాయిస్ ,కోదాడ: రోడ్డుపై భారీ గుంత.. వాహనదారులకు ప్రాణసంకటం కోదాడ నుంచి హుజూర్‌నగర్ వెళ్లే మార్గంలోని సర్వీస్ రోడ్డు మూలమలుపు వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రమాదాలకు కారణమవుతోంది. గుంతను తప్పించుకునేందుకు విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు మూలమలుపు వద్ద నేరుగా దూసుకొచ్చి ఎడమవైపు తిరుగుతున్నాయి. దీంతో అండర్‌పాస్ దాటే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలతో ఢీకొనే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కారులో మిర్యాలగూడకు వెళ్తున్న ఓ వాహనదారుడికి ఇదే అనుభవం ఎదురైంది. అండర్‌పాస్ దాటుతుండగా ఓ డీసీఎం వాహనం తమ కారును ఢీకొట్టేంత దగ్గరకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తృటిలో ప్రమాదం తప్పినా.. అక్కడి పరిస్థితులు చూస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రమాదం జరిగాకే స్పందిస్తారా.?

ప్రజల రాకపోకలకు కీలకమైన సర్వీస్ రోడ్డు మూలమలుపు వద్ద ఇంతటి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారీ గుంతను వెంటనే పూడ్చి, వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రాణాలు బలయ్యాక హడావుడి చేసే బదులు.. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టెడన్నం కోసం పడిగాపులు

- రోడ్ల పక్కన ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులెందరో!
- పెళ్లిళ్లు, విందుల్లో మిగిలే ఆహారం.. పేదల ఆకలి తీర్చలేదా?
- ఆకలి విలువ తెలిసేది ఆకలితో అలమటించే వారికేనా!
- ఆకలిని చూసి కనికరం చూపే హృదయం ఉన్నప్పుడే కదా సమాజంలో మానవత్వం బతికున్నట్లు!



ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:ఈ సమాజంలో సంపదకు కొదవలేదు.. సంపాదనకు హద్దుల్లేవు.. విలాసాలకు అంతులేదు. కానీ అదే సమాజంలో ఒక్క పూట కడుపునిండా అన్నం దొరికితే చాలు అని ఎదురుచూస్తున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఒకవైపు పెళ్లిళ్లు, శుభకార్యాలు, విందులు, వినోదాల పేరుతో టన్నుల కొద్దీ ఆహారం చెత్తకుప్పల్లోకి చేరుతుంటే.. మరోవైపు పట్టెడన్నం కోసం పేదలు పడిగాపులు కాస్తున్న దృశ్యాలు మనిషి మనసును కలచివేస్తున్నాయి.

ఒకరికి విందు.. మరొకరికి పస్తులు!

హోటళ్లలో, ఫంక్షన్ హాళ్లలో రుచికరమైన వంటకాలు వడ్డించినా తినలేక మిగిల్చి పారేస్తుంటారు. ఇంట్లో ఏ వంట చేయాలా అని ఆలోచించే వారు కొందరైతే.. ఈరోజు ఏం తినాలి? ఎక్కడ తినాలి? అనే ప్రశ్నలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసే వారు మరికొందరు. కూలి పనికి వెళితేనే పొయ్యి వెలిగే కుటుంబాలు ఎన్నో. పని దొరకని రోజు వారి ఇళ్లలో ఆకలే రాజ్యమేలుతుంది.

ఆకలి ముందు ఆత్మగౌరవం చిన్నబోతుందా?

చిరిగిన దుస్తులతో, నీరసించిన శరీరాలతో రోడ్ల పక్కన కూర్చుని సహాయం కోసం ఎదురుచూసే వృద్ధులు, అనాథలు, నిరుపేదలు మనకు నిత్యం కనిపిస్తుంటారు. అడగడానికి ఆత్మగౌరవం అడ్డొస్తుంది.. అడగకపోతే ఆకలి బాధిస్తుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో పిల్లల ఆదరణ లేక, సంపాదించే శక్తి కోల్పోయి రెండు పూటల భోజనం కోసం ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే అభాగ్యుల పరిస్థితి మరింత దయనీయం.

ఆహారాన్ని గౌరవించడం నేర్చుకోవాలి!

ఆకలి అనేది కేవలం పేదరికానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. అది సమాజం ఎదుర్కొంటున్న మానవీయ సవాలు. మన ఇంట్లో మిగిలిపోయిన ఆహారం మరొకరి ఆకలి తీర్చవచ్చు. మనం వృథా చేసే ఒక్క ముద్ద అన్నం మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చు. అందుకే అవసరానికి మించి ఆహారం వండకూడదు. మిగిలిన మంచి ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి చేరవేసే ప్రయత్నం చేయాలి.హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ఎంతోమంది ఆకలి తీర్చవచ్చు. ప్రభుత్వాలు కూడా నిరుపేదలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు అన్నదాన కేంద్రాలు, సామాజిక పంటశాలలను మరింత బలోపేతం చేయాలి.

మనిషిని మనిషిగా నిలబెట్టేది మానవత్వమే!

డబ్బు సంపాదించడం గొప్ప కాదు.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప. దేవాలయాల్లో వేల రూపాయలు సమర్పించే మనం.. మన కళ్లముందు ఆకలితో ఉన్న మనిషికి ఒక ముద్ద అన్నం పెట్టగలిగితే అదే నిజమైన మానవత్వం. పుట్టినప్పుడు ఏమీ తీసుకురాము.. పోయేటప్పుడు ఏమీ తీసుకెళ్లము. కానీ మనం చేసిన మంచి పనులు, పంచిన ప్రేమ, తీర్చిన ఆకలి మాత్రం నలుగురి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.గుర్తుంచుకోండి.. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం ఉపకారం కాదు.. తోటి మనిషిగా మన బాధ్యత.

మేడారం నుంచి కోటగుళ్ల వరకు.. కాకతీయ వైభవంపై అవగాహన

- పదో రోజుకు చేరిన ప్రపంచ వారసత్వ వాలంటీర్ల శిక్షణ శిబిరం
- చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- ప్రొఫెసర్ పాండురంగారావు, శ్రీధరరావు.

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వాలంటీర్ల శిక్షణ శిబిరం పదో రోజుకు చేరుకుంది. శిక్షణలో భాగంగా వాలంటీర్లు మేడారం, లక్నవరం సరస్సు, ఘనపురం కోటగుళ్లను సందర్శించి ఆయా ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక విశేషాలను తెలుసుకున్నారు. మొదట గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క–సారలమ్మ కొలువైన మేడారం క్షేత్రాన్ని సందర్శించారు. ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం జాతర విశిష్టత, ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకున్నారు. అమ్మవార్లను దర్శించుకొని ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రకృతి సోయగాలకు ప్రసిద్ధి చెందిన లక్నవరం సరస్సును సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సరస్సు అందాలను చిత్రీకరించుకుంటూ సందడి చేశారు. అక్కడి నుంచి ఘనపురం కోటగుళ్లకు చేరుకొని కాకతీయుల కాలంనాటి అద్భుత నిర్మాణాలు, శిల్పకళా నైపుణ్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కాకతీయ వారసత్వ ట్రస్ట్ సభ్యులు ప్రొఫెసర్ పాండురంగారావు, శ్రీధరరావు కోటగుళ్ల చారిత్రక నేపథ్యం, కాకతీయుల పాలన, ఆలయ నిర్మాణ విశేషాలను వాలంటీర్లకు వివరించారు. మన చరిత్రను తెలుసుకోవడంతో పాటు, మన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని వారు పేర్కొన్నారు. ఈ పర్యటనలో కాకతీయ వారసత్వ ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాస్, రాష్ట్ర పురావస్తు శాఖ పర్యవేక్షకుడు బాబు, యోగ గురువు యోగి రాంబాబు, శిక్షణ పొందుతున్న వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.





జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాలకుర్తి విద్యార్థిని గంట సుహాస్య ఎంపిక!

- NIDJAM (నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్) అండర్-16లో 60 మీటర్ల పరుగు విభాగంలో జాతీయస్థాయికి అర్హత.
- SGFI (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-17లో 200 మీటర్ల పరుగు, రిలే లో రాష్ట్రస్థాయి అర్హత
- రెండు విభాగాలు.. ఒకటి రాష్ట్రస్థాయి మరొకటి జాతీయ స్థాయి ఎంపికలు
- పాలకుర్తి బిడ్డ గంట సుహాస్య సంచలనం!

ప్రజా వాయిస్ / పాలకుర్తి/ నవంబర్ 01 క్రీడారంగంలో పాలకుర్తి విద్యార్థిని గంట సుహాస్య అరుదైన ప్రతిభను చాటుకుంది. అథ్లెటిక్స్ పోటీల్లో వరుస విజయాలు సాధిస్తూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పాలకుర్తి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో 200 మీటర్ల పరుగు పందెం, రిలే విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అదే విధంగా నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ (NIDJAM) అండర్-16 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలోనూ జాతీయస్థాయికి అర్హత సాధించింది.పాలకుర్తిలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న గంట సుహాస్య చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ తన ప్రతిభను నిరూపించుకుంటోంది. ఒకేసారి రెండు విభిన్న క్రీడా వేదికలపై జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం.సుహాస్య సాధించిన ఈ ఘనతపై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తూ జాతీయస్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పలువురు గ్రామస్తులు, విద్యాభిమానులు సుహాస్యకు అభినందనలు తెలిపారు.

అకారణంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- ఆరు నెలలుగా పట్టించుకోని ఎలైన్స్ కాంట్రాక్టర్ తరుణ్ కుమార్
- న్యాయం చేయకుంటే మెడికల్ కాలేజీ ఎదుట నిరాహార దీక్షకు సిద్ధం



ప్రజా వాయిస్ గోదావరిఖని సింగరేణి సౌజన్యంతో గోదావరిఖనిలో నిర్మించిన మెడికల్ కాలేజీలో సెక్యూరిటీ, స్కావెంజర్, స్వీపర్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారని బాధిత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా తొలగించిన తమను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.మెడికల్ కాలేజీ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకున్నామని కార్మికులు తెలిపారు. ఒక్కసారిగా విధుల నుంచి తొలగించడంతో భార్యాపిల్లలతో సహా రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక, పిల్లల పాఠశాల ఫీజులు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

ఆరు నెలలుగా స్పందన కరువు

తమకు జరిగిన అన్యాయంపై అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేసినా న్యాయం జరగలేదని కార్మికులు పేర్కొన్నారు. పలుమార్లు ఎలైన్స్ కాంట్రాక్టర్ తరుణ్ కుమార్‌ను కలిసి వినతులు, మెమోరాండాలు ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన సమాధానం రాలేదని ఆరోపించారు. ఆరు నెలలు గడుస్తున్నా తమ సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు అందకపోయినా స్థానికులమనే ఉద్దేశంతో తక్కువ జీతాలకే పనిచేశామని, అలాంటప్పుడు తమను ఏ కారణంతో విధుల నుంచి తొలగించారని ప్రశ్నించారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

ఇప్పటికైనా కాంట్రాక్టర్ తరుణ్ కుమార్ పునరాలోచించి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. తమ కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కుటుంబ సభ్యులతో కలిసి మెడికల్ కాలేజీ ఎదుట నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. తమకు న్యాయం జరిగే వరకు కాంట్రాక్టర్‌ను వివరణ కోరుతూ పోరాటం కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

మునుగోడులో ఉచిత కంటి వైద్య సేవలకు విశేష స్పందన

- 18వ విడత శిబిరంలో 623 మందికి కంటి పరీక్షలు
- 228 మందికి ఆపరేషన్లకు ఎంపికకంటి చూపు ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యం
- కోమటిరెడ్డి లక్ష్మీ
- మీ బాధ్యత నాది.. ధైర్యంగా వెళ్లి కంటి ఆపరేషన్లు చేయించుకోండి –ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



ప్రజా వాయిస్,మునుగోడు.నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో 18వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్ల వద్ద కంటి పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు, మహిళలను దంపతులు ఆత్మీయంగా పలకరిస్తూ వైద్య సేవల తీరును పరిశీలించారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, వారి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మీ మాట్లాడుతూ కంటి చూపు ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని, నియోజకవర్గంలో ఎవరూ కంటి సమస్యలతో బాధపడకుండా మెరుగైన వైద్యం అందించడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పించి, వారు భోజనం చేశారా లేదా అని స్వయంగా పర్యవేక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన 17 శిబిరాల్లో 13,430 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 2,859 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. మరో 6,075 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. తాజాగా నిర్వహించిన 18వ విడత శిబిరంలో 623 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 228 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వీరిలో 109 మందిని వెంటనే హైదరాబాద్‌లోని శంకరా కంటి ఆసుపత్రికి తరలించారు. ఫీనిక్స్ ఫౌండేషన్, శంకరా కంటి ఆసుపత్రి సహకారంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలను నిరంతరాయంగా నిర్వహిస్తోంది.



దుబ్బాకలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణపై రైతుల తీవ్ర ఆగ్రహం

- మార్కెట్ యార్డుకు తాళం, దళారుల బారిన పడుతున్న అన్నదాతలు

ప్రజా వాయిస్ దుబ్బాక దుబ్బాక ప్రాంతంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకుందామంటే మార్కెట్ యార్డు తలుపులు తెరుచుకోకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఒకవైపు సన్నబియ్యం సాగును ప్రోత్సహించి, మరోవైపు చేతికొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటివరకు ప్రారంభించకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తోంది. అధికారులు, ఏఎంసీ పాలకవర్గం దళారులతో కుమ్మక్కయ్యారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని, వర్షాలు లేక కష్టపడి పండించిన పంటను దళారులకు తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.మరోవైపు, భూగర్భ జలాలు పడిపోతాయని, ఎల్ నినో ప్రభావం ఉందంటూ వచ్చే యాసంగిలో వరి సాగు వద్దని ప్రచారం చేసే అధికారులు, ప్రస్తుతం చేతిలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. రైతులు పండించిన పంట కొనుగోలు బాధ్యతను పక్కనపెట్టి దుబ్బాక మార్కెట్ కమిటీ పాలకవర్గం ఢిల్లీ పర్యటనలో మునిగి తేలడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల సమస్యలను గాలికి వదిలేసి పదవులను అనుభవించడమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి ఏఎంసీ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని, లేనిపక్షంలో రైతులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ యువ నాయకుడి ఇంట్లోనే పేకాట శిబిరం .. ఐదుగురు అరెస్ట్!

- నెన్నెలలో పోలీసుల ఆకస్మిక దాడి
- రూ.8,395 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం
- రోజుకు రూ.2 వేల అద్దెకు ఇల్లు ఇచ్చినట్లు ఆరోపణలు
- రెండు నెలలుగా పేకాట నిర్వహణపై స్థానికంగా చర్చ



ప్రజా వాయిస్ నెన్నెల మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలంలో ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన నాయకుల ఇళ్లే అక్రమ కార్యకలాపాలకు వేదికలుగా మారుతున్నాయనే ఆరోపణలు నెన్నెల మండలంలో చర్చనీయాంశంగా మారాయి. మండలంలోని బిరుదువాడ శివారులో కాంగ్రెస్ యువ నాయకుడికి చెందిన ఇంట్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

పోలీసుల ఆకస్మిక దాడి.. ఐదుగురు పట్టుబాటు

పోలీసుల సమాచారం ప్రకారం.. నెన్నెల మండలంలోని బిరుదువాడ శివారులో ఓ ఇంట్లో కొంతకాలంగా పేకాట ఆటలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సంబంధిత ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించి పేకాటకు వినియోగిస్తున్న పేకముక్కలతో పాటు రూ.8,395 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోజుకు రూ.2 వేల అద్దెకు ఇల్లు?

ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన విషయం స్థానికంగా చర్చకు వస్తోంది. పేకాట ఆడేందుకు ఇంటిని రోజుకు రూ.2,000 చొప్పున అద్దెకు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత రెండు నెలలుగా ఇదే ప్రాంతంలో పేకాట కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే ఇంటి అద్దె, పేకాట నిర్వహణ కాలవ్యవధికి సంబంధించి అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.


నాయకుడి ఇంట్లో పేకాట వ్యవహారం కలకలం

సాధారణంగా ప్రజా సమస్య పరిష్కారంలో ముందుండాల్సిన రాజకీయ నాయకులు, యువ నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉంది. అలాంటిది రాజకీయ నాయకుడికి చెందిన ఇంట్లోనే పేకాట ఆడుతున్న ఐదుగురు పట్టుబడిన ఘటన నెన్నెలలో చర్చనీయాంశంగా మారింది. రాజకీయ పలుకుబడి ఉన్నా చట్టం ముందు అందరూ సమానులేనని ఈ ఘటన మరోసారి చర్చకు తెచ్చింది.

అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచాలి

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పేకాట వంటి జూద కార్యకలాపాలు ఎక్కడ నిర్వహించినా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. యువతను తప్పుదారి పట్టించే ఇలాంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, పేకాట నిర్వహణ వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ సమగ్ర విచారణ జరపాలని అభిప్రాయపడుతున్నారు.. మొత్తానికి కాంగ్రెస్ యువ నాయకుడికి చెందిన ఇంట్లో పేకాట ఆడుతూ ఐదుగురు పోలీసులకు పట్టుబడిన ఘటన నెన్నెల మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంలో పోలీసుల తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.





సాగర్ కాలువలో విష రసాయనాల కలకలం.!

- చింతపల్లి సమీపంలో లెవల్ కాలువలో ప్రమాదకర రసాయనాలు
- గుర్తుతెలియని వ్యక్తుల నిర్వాకం.. స్థానికుల్లో ఆందోళన
- కాలువలో రసాయనాలు పారబోసిన వారెవరు?
- పోలీసులకు ఫిర్యాదు.. సీసీటీవీ ఫుటేజీతో నిందితుల కోసం గాలింపు
- బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

ప్రజా వాయిస్,పెద్దవూర: నాగార్జునసాగర్ లెవల్ కాలువలో ప్రమాదకర రసాయనాలు పారబోసిన ఘటన కలకలం రేపింది. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు కాలువలో రసాయనాలను పారబోసినట్లు స్థానికులు గుర్తించారు. దీంతో కాలువ నీటిలో రసాయనాలు కలవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.కాలువలో రసాయనాలు పారబోసిన విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. రసాయనాలను ఎవరు పారబోశారు. ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. ఏ ఉద్దేశంతో ఈ పని చేశారు. అనే కోణాల్లో ఆరా తీస్తున్నారు.నిందితుల ఆచూకీ కోసం సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. కాలువలో ప్రమాదకర రసాయనాలు పారబోసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువలో రసాయనాల ప్రభావంపై పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పల్లె దవాఖాన ముందే పెద్ద పెద్ద గుంతలు

- రోగులు గర్భిణీలు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- వృద్ధులు,చిన్నపిల్లలు ఆద మరిస్తే అంతే సంగతి
- గుంతలను వెంటనే పూడ్చాలని స్థానికులు డిమాండ్

ప్రజా వాయిస్,చెన్నారావుపేట : చెన్నారావుపేట మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో ప్రమా దకరంగా మారిన పల్లె దవాఖానకు ప్రమాద పరిస్థితి నెలకొంది. బొందలల్లో వర్షం వస్తే దాని నిండా నీళ్లు నిల్వ ఉండే పరిస్థితి కోనాపురం గ్రామంలో పల్లె దవాఖాన ముందే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వచ్చి పోయే రోగులకు, చిన్న పిల్లలకు, వృద్ధులకు అందులో పడే పరిస్థితిల మారింది.అంతేకాకుండా గుంతలు మొత్తం నీటితో నిండి పోయి ఉంది.ఆ బొందలల్లో పడి ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యులని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేసి రోగులకుఏ ఎటువంటి ఇబ్బంది. లేకుండా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.







వాహనదారులకు ప్రాణసంకటంగా మారిన బొగ్గు టిప్పర్లు

- టార్పాలిన్లు కప్పకుండానే ఇష్టానుసారంగా రవాణా
- రోడ్లపై పడుతున్న బొగ్గు తునకలు
- భయాందోళనలో ప్రయాణికులు, స్థానికులు
- మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న లారీలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజా వాయిస్ మంచిర్యాల ప్రతినిధి సింగరేణి ప్రాంతంలో బొగ్గు రవాణా స్థానిక ప్రజలకు శాపంగా మారుతోంది. మందమర్రి పరిసర ప్రాంతాల్లో బొగ్గు రవాణా చేసే లారీ టిప్పర్లు నిబంధనలను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రవాణా చేస్తున్న టిప్పర్లపై కనీసం టార్పాలిన్లు (కవర్లు) కూడా కప్పకుండా బొగ్గును తరలిస్తుండటంతో తీవ్ర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.నిబంధనల ప్రకారం బొగ్గు రవాణా చేసే లారీలకు టార్పాలిన్ కచ్చితంగా కప్పాలి. అయితే, డ్రైవర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. దీనికితోడు లారీలు మితిమీరిన వేగంతో (ఓవర్‌స్పీడ్) దూసుకెళ్తుండటంతో.. కంటైనర్ల మీద నుంచి బొగ్గు తునకలు నేరుగా రోడ్లపై పడిపోతున్నాయి. వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్ల డ్రైవర్లపై ఈ బొగ్గు ముక్కలు పడటంతో పాటు, జారి కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రమాదాలు మరింత ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్లపై బొగ్గు రవాణా చేస్తున్న లారీలు ఇంత బహిరంగంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నా.. సంబంధిత పోలీసులు, రవాణా శాఖ (ట్రాన్స్‌పోర్ట్), సింగరేణి అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి, టార్పాలిన్లు కప్పకుండా తిరిగే టిప్పర్లపై, ఓవర్‌స్పీడ్‌గా వెళ్లే లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని మందమర్రి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల ప్రజల ప్రాణాలను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు

భూమిని కమ్ముకున్న ప్లాస్టిక్ భూతం

భావితరాల మనుగడకు పెరుగుతున్న ముప్పు

ప్రజా వాయిస్ |పాలకుర్తి నగర్ | నవంబర్ 1 నానాటికీ విస్తరిస్తున్న ఆధునిక జీవనశైలిలో మనిషి సృష్టించిన నిశ్శబ్ద శత్రువు ప్లాస్టిక్ భూతం. సౌకర్యం పేరుతో మన అనునిత్య జీవితంలో భాగమైన ఈ ప్లాస్టిక్, నేడు ప్రకృతి ఒడిలో విషపు విత్తనాలు చల్లుతోంది. మనం ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు, సీసాలు ఏళ్ల తరబడి భూమి గుండెలపై చెరగని మచ్చలా మిగిలిపోతున్నాయి.జీవజాలానికి శాపం... ప్రకృతికి ఉరితాడుప్లాస్టిక్ వ్యర్థాలు కేవలం నేలను మాత్రమే కాకుండా సమస్త జీవకోటిని ప్రమాదంలోకి నెడుతున్నాయిజలవనరుల కాలుష్యం కాల్వలు, నదులు, సముద్రాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. నదుల సహజ ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, సముద్రాల ఒడిని, చెరువుల నీటిని విష పూరితం చేస్తూ ప్రకృతి శ్వాసను కుదిపేస్తున్నాయి.మూగజీవాల ఆర్తనాదాలు మనం రోడ్లపై పారేసే ప్లాస్టిక్ కవర్లను, ఆహార వ్యర్థాలను వేరు చేయలేక మూగజీవాలు (ఆవులు, వీధి కుక్కలు మొదలైనవి) మింగేస్తున్నాయి. వాటి పొట్టలో ప్లాస్టిక్ పేరుకుపోయి అత్యంత దారుణమైన పరిస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. వాటి నిస్సహాయ చూపుల్లో మన మానవ నిర్లక్ష్యమే ప్రతిబింబిస్తోంది.వ్యవసాయానికి విఘాతం పొలాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ భూమాత ఒడిని కలుషితం చేస్తోంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోకుండా అడ్డుపడటంతో నేల సారం తగ్గిపోతోంది.ఏం చేసినా నష్టమే! ప్లాస్టిక్ అనేది నేలలో కలవదు, నీటిలో కరగదు. తర తరాలకూ దాని ఆనవాళ్లు భూమిపైనే ఉండిపోతాయి.కాల్చితే ప్లాస్టిక్‌ను తగలేస్తే విడుదలయ్యే విష వాయువుల వల్ల గాలి తీవ్రంగా కలుషితమై శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతుంది.పాతిపెడితే భూమిలో పాతిపెడితే నేల తత్వం దెబ్బతిని, భూగర్భ జలాలు కలుషితమవుతాయి.వదిలేస్తే నీరు, నేల, జీవజాలం, సమస్త పర్యావరణం దీనికి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

పరిష్కార మార్గం తగ్గించడం... తిరిగి వాడటం

ఈ ముప్పు నుంచి బయట పడటానికి మన దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని నిపుణులు పేర్కొంటున్నారు.సంచులలో మార్పు మార్కెట్‌కు వెళ్లే టప్పుడు ప్లాస్టిక్ కవర్లకు స్వస్తి చెప్పి, గుడ్డ సంచి లేదా జూట్ సంచిని తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి.సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు వీడ్కోలు ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, వాటర్ బాటిళ్లను పూర్తిగా నిషేధించాలి.పునర్వినియోగం వీలైనంత వరకు ఇంట్లోని వస్తువులను పునర్వినియోగించడం నేర్చుకోవాలి. చిన్న మార్పే అయినా అది ప్రకృతికి పెద్ద ఊపిరిగా మారుతుంది.

మన బాధ్యత... భావితరాల భవిష్యత్తు

ప్రతి ఇంటా ప్లాస్టిక్ నివారణపై చైతన్యం వెలగాలి. ప్రతి హృదయంలో ప్రకృతి ప్రేమ మొలకెత్తినప్పుడే ఈ ప్లాస్టిక్ భూతం మన సమాజం నుంచి పారిపోతుంది. అప్పుడే పచ్చని భూమి మళ్లీ సంతోషంతో నవ్వుతుంది. రేపటి మన భావితరాలకు కేవలం ధనం, పెద్ద భవనాలు మాత్రమే ఆస్తిగా ఇస్తే సరిపోదు. వారు ఆరోగ్యంగా జీవించడానికి స్వచ్ఛమైన గాలి, నిర్మలమైన నీరు, పచ్చని పర్యావరణాన్ని వారసత్వంగా అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. ఇప్పటికైనా మేల్కొందాం... ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం, ప్రకృతిని కాపాడుకుందాం, ఈ భూమిని భావితరాలకు సుందరమైన గృహంగా మిగులుద్దాం.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి –కేసు నమోదు

- గంభీర్ పూర్ శివారులో ప్రమాదం
- టాటా ఇంట్రా వాహనం కాంక్రీట్ మిక్సర్ ఢీకొడిపడి ఘోరం
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశోక్ మృతి
- డ్రైవర్ పై కేసు నమోదు చేసిన కథలాపూర్ ఎస్సై రవికిరణ్



ప్రజా వాయిస్, కథలాపూర్: కాంక్రీట్ మిక్సర్ ఊడిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామ శివారులో జరిగింది. ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం... బొమ్మెన గ్రామానికి చెందిన పెద్దకాపు అశోక్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా వచ్చిన టాటా ఇంట్రా వాహనం వెనుక భాగంలోని కాంక్రీట్ మిక్సర్ ఊడిపడి అశోక్‌ను బలంగా తాకింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ సలంగన మాలకొండయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గురువును మించిన శిష్యుడు?

- కరువు గణాంకాల్లోనూ పోటీ?
- 2002లో గురువుకు ప్రకృతి పరీక్ష
- 2026లో శిష్యుడికి అగ్నిపరీక్ష?
- చంద్రబాబు నాటి కరువు సంక్షోభం
- రేవంత్ ముందు మళ్లీ అదే సవాల్?
- గురువును గద్దె దించిన కరువు
- శిష్యుడికీ ప్రకృతి హెచ్చరిక!
- 111 మండలాల్లో తీవ్ర కరువు
- 254 మండలాల్లో మధ్యస్థ ప్రభావం!
- ప్రాజెక్టుల్లో మిగిలింది 30 శాతం నీరే
- ప్రశ్నార్థకంగా మారిన ఖరీఫ్ భవిష్యత్తు!
- నాడు వైఎస్సార్ కు కలిసొచ్చిన కరువు
- నేడు రేవంత్ కు సవాలుగా మారిందా?







ప్రజా వాయిస్ ఖమ్మం:చరిత్ర పునరావృతమవుతోందా? రాజకీయ గురువు బాటలోనే శిష్యుడి పాలన కూడా తీవ్ర ప్రకృతి పరీక్షను ఎదుర్కొంటోందా? అంటే అవుననే అంటున్నాయి అధికారిక లెక్కలు, క్షేత్రస్థాయి వాస్తవాలు. రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అధికారాన్ని కదిలించి, వైఎస్సార్‌కు పట్టం కట్టిన "కరువు సంక్షోభం".. సరిగ్గా 20 ఏళ్ల తర్వాత తెలంగాణలో ఆయన శిష్యుడిగా గుర్తింపు పొందిన సీఎం రేవంత్ రెడ్డిని సైతం అదే స్థాయిలో వెంటాడుతోంది. నాడు చంద్రబాబు సర్కారు హయాంలో వర్షాభావం తీవ్రరూపం దాల్చి, వరి పంట వేయొద్దంటూ ప్రత్యామ్నాయాలు సూచించడం రైతాంగ ఆగ్రహానికి కారణమై పాలకుల మార్పునకు దారితీసింది. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే అధికారికంగా 365 మండలాల్లో కరువు ఛాయలు అలుముకోవడం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది.

రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసిన అధికారిక ఉత్తర్వులు, కేబినెట్ సబ్-కమిటీ నివేదికల ప్రకారం రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను హైదరాబాద్, పెద్దపల్లి మినహా మిగిలిన 31 జిల్లాల్లో కరువు తీవ్రత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం గుర్తించిన మొత్తం 365 మండలాల్లో 111 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనగా, మరో 254 మండలాల్లో మధ్యస్థ కరువు విస్తరించింది. నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణంగా నమోదు కావాల్సిన 740.6 మి.మీ వర్షపాతానికి గాను కేవలం 615.5 మి.మీ మాత్రమే నమోదై, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. దాదాపు 18 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయి బోర్లు సైతం ఎండిపోతున్నాయి.ఈ నీటి కొరత ప్రభావం నేరుగా రైతుల ప్రధాన జీవనాధారమైన వరి పంటపై తీవ్ర పిడుగులా పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ మొత్తం సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు పడిపోగా, ఒక్క వరి సాగు విస్తీర్ణమే 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు, అంటే ఏకంగా 18 శాతం మేర కుప్పకూలింది. దీనికి ప్రధాన కారణం ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు అడుగంటడమే. రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టుల మొత్తం నిల్వ సామర్థ్యం 585 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 179.63 టీఎంసీలు, అంటే సుమారు 30 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పంట నష్టపోయిన అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఉపాధి హామీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి ఎన్డీఆర్ఎఫ్ కింద ఏకంగా రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కోరడం క్షేత్రస్థాయి విపత్కర పరిస్థితులకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది.

కరువు తీవ్రత పరిశీలిస్తే సరిహద్దు, దక్షిణ తెలంగాణ జిల్లాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. నల్గొండ జిల్లాలో అత్యధికంగా 28 మండలాలు, సంగారెడ్డి జిల్లాలో మొత్తం 28 మండలాలు, సూర్యాపేటలోని మొత్తం 23 మండలాలు కరువు జాబితాలోకి చేరాయి. అన్నింటికంటే ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు వికారాబాద్ జిల్లాలోని మొత్తం 20 మండలాలనూ కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చింది. వీటితో పాటు ఆదిలాబాద్‌లో 20, నిజామాబాద్‌లో 18, రంగారెడ్డిలో 18, ఖమ్మంలో 17 మండలాలు, అలాగే జోగులాంబ గద్వాల, నారాయణపేట, హనుమకొండ జిల్లాల్లోని అన్ని మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయి. సీఎం సొంత ఇలాకాలోనే అన్ని మండలాలు కరువు బారిన పడటం ప్రతిపక్షాలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారింది.

2004 నాటి ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తే.. చంద్రబాబు ప్రభుత్వం కరువు పరిస్థితులను సమర్థవంతంగా అంచనా వేయడంలో విఫలమైందన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. వ్యవసాయం దండగ అనే ముద్రను వైఎస్సార్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, కరవు కోరల్లో నలిగిన రైతాంగాన్ని ఏకం చేసి టీడీపీ ప్రభుత్వాన్ని గద్దె దించారు. ఇప్పుడు తెలంగాణలోనూ పరిస్థితులు సరిగ్గా అదే బాటలో సాగుతున్నాయి. కాలువల్లో నీళ్లు పారక, బోర్లలో నీళ్లు రాక ఎండిపోతున్న పైర్లను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలు, మరోవైపు రైతుభరోసా చెల్లింపుల్లో జాప్యం, రుణమాఫీపై నెలకొన్న స్పష్టతారాహిత్యం అన్నదాతల్లో అసంతృప్తికి ఆజ్యం పోస్తున్నాయి.


ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఇదే అదనుగా పొలాల బాట పడుతూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నాయి. నాడు గురువు చంద్రబాబును దెబ్బకొట్టిన విపత్కర పరిస్థితులే నేడు రేవంత్ రెడ్డి ముందు కొండంత సవాలుగా నిలిచాయి. నాటి చరిత్ర పునరావృతం కాకుండా ఉండాలంటే.. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కరువు నివారణ చర్యలు చేపట్టడం, ప్రతి ఎకరానికీ తక్షణ నష్టపరిహారం అందించి అన్నదాతకు భరోసా కల్పించడం రేవంత్ సర్కారుకు అత్యంత కీలకంగా మారింది. లేనిపక్షంలో గురువు ఎదుర్కొన్న రాజకీయ పరాభవాన్నే శిష్యుడు కూడా చవిచూడాల్సి వస్తుందన్న హెచ్చరికలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



అంగన్వాడి కేంద్రాలకు గ్రేడింగ్ చెయ్యని కోడిగుడ్లు సరఫరా..?

- కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడానికి వెనకంజ..!
- చిన్న సైజు గుడ్లతో చిన్నారులకు, పౌష్టికాహారం అందేనా?
- గర్భిణీ స్త్రీలు,బాలింతల సంగతేంటి
- సంబంధిత ఉన్నతాధికారులు ఉన్నట్లా లేనట్లా
- పర్యవేక్షణ లోపమా.. మామూళ్ల మత్తులోన...?
- బహిర్గతంగా ఆరోపిస్తున్న బాలింతలు.

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాలు, గుడ్లు, బియ్యం, బలమ్మతం. మెడికల్ కిట్లు, ఆకుకూరలు పప్పు దినుసులతో సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా విస్తృతమైన సేవలు అందిస్తోంది. కాంట్రాక్టర్ చేతివాటంతో ప్రభుత్వ ఆశయాలు ఆమడ దూరంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు బలమైన పౌష్టికాలను అందించాలన్న లక్ష్యంతో కాంట్రాక్టు పద్ధతిలో అంగన్‌వాడీల ద్వారా కోడిగుడ్లను పంపిణీ చేస్తోంది. అయితే గుడ్ల సరఫరా లో గ్రేడింగ్ లేకుండా అంగన్వాడి కేంద్రాలకు కాంట్రాక్టర్లు గుడ్లను సరఫరా చేస్తున్నారు..... హనుమకొండ జిల్లాలో అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న గుడ్ల ట్రేలలో గ్రేడింగ్ లేని గుడ్లు దర్శనమిస్తున్నాయి.బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు వారంలో ఆరు రోజుల పాటు నిత్యం గుడ్డు అంగన్‌వాడీల ద్వారా అందించాలి.అంగన్‌వాడీల్లో లబ్ధిదారులకు ప్రస్తుతం గుడ్లు సక్రమంగానే పంపిణీ అవుతున్నా పరిమాణం మాత్రం చాలా చిన్నగా ఉండటంతో లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.బహిరంగ మార్కెట్‌లో లభించే గుడ్ల బరువుకు అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న వాటికి భారీ వ్యత్యాసం కనిపిస్తోంది.గుడ్లు సరఫరాను చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లు చిన్న పరిణామంలో సరఫరా చేస్తూ ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం గుడ్లు సరఫరా చేస్తోంది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఒక్క గుడ్డు 45 గ్రాములు ఉండవలసి ఉండగా చిన్న సైజు గుడ్లు పంపిస్తూ కేసుకు 30 గుడ్లు ఒక్క కిలో 350 గ్రాములు ఉంటున్నాయని చెప్పి గ్రేడింగ్ లేని గుడ్లను సరఫరా చేస్తూ ప్రభుత్వ సొమ్మును అప్పనంగా కాంట్రాక్టర్ కాచేస్తున్నాడని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. చిన్న సైజు గుడ్లు వచ్చినట్లయితే కాంట్రాక్టర్ కు వాపస్ చేయాలని సంబంధిత ఉన్నత అధికారులు చెబుతున్నప్పటికీ అంగన్వాడీలు . కోడి గుడ్లను వేయింగ్ మిషన్ ద్వారా వెయిట్ వేసుకొని తీసుకోవాలని అంగన్వాడి కేంద్రాలకు సమాచారం అందిస్తున్నప్పటికీ తిరిగి అంగన్వాడీ టీచర్లు పంపించకపోవడంలో అంతర్యం ఏమిటని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని. బాలింతలకు. చిన్నారులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం కోడిగుడ్డు సైజును పెంచాలని వేడుకుంటున్న హనుమకొండ ప్రజలు.a



అధికారులకు అధికారులే శత్రువులా!?

- విధి నిర్వహణలో బెదిరింపులకు పాల్పడిన మౌనమేనా!?
- చిన్న స్థాయి ఉద్యోగిని చులకంగా చూస్తున్న వైనం!
- పంచాయతీలలో ప్రజల సొమ్ము ఇవ్వలేదని కక్ష సాధింపులు?
- ప్రజాస్వామ్యంలో నిజాయితీగా ఉన్న ఉద్యోగస్తులకు చుక్కెదురు!
- అక్రమాలకు పాల్పడుతున్న నాయకులకు పై స్థాయి అధికారులే అండ?
- అందరూ మంచిగానే ఉంటారు తదుపరి క్రూరత్వం అంటూ బాధితులు!
- ప్రజాధనం తినేందుకు అందరూ సూత్రధారులే అంటూ ప్రజల ఆగ్రహం!?




ప్రజా వాయిస్ అశ్వారావుపేట ప్రస్తుత పరిస్థితులలో ప్రజాప్రతినిధుల కోసం అధికారులు అధికారులకే శత్రువుల తయారయ్యారని చెప్పుకోవచ్చు అంతేకాకుండా కార్యాలయాల్లో కాంట్రాక్టు పనులు విషయానికొస్తే అధికారులపై ప్రజా ప్రతినిధులు కక్షాదింపులు పెంచుకోవడంతో పాటు వారిని మరో ప్రదేశానికి జిల్లా యంత్రంగా సహకారాలతో బదిలీలు చేయించడం ప్రజాప్రతినిధులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది పంచాయతీలోని ప్రజల సొమ్ము ఇవ్వలేదని ఆక్రత్వంతో ఊగిపోతున్న కొందరు నాయకులు చిన్న స్థాయి ఉద్యోగస్తులను ఏ రూపంలో వారిని ఇబ్బందులు గురుచేయాలో ఆ విధంగా వారిపై కక్షాదింపులు పెట్టుకోవడమే పనిగా పెట్టుకుంటున్నారు అంతేకాకుండా మంచిగా నటిస్తూ అందరితో స్నేహబంధాలుగా ఉంటూ క్రూరత్తం గా వ్యవహరిస్తున్నారంటూ కొందరు బాధితులు మౌనవహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిధిలోని నందిపాడు అనంతారం బచ్చువారి గూడెం నారాయణపురం వినాయకపురం వంటి కార్యాలయాలతో పాటు మిగిలిన కొన్ని పంచాయతీలలో కూడా పంచాయతీ సెక్రెటరీ ఇబ్బందులకు గురి చేయటం కొందరు ప్రజాప్రతినిధులకు మంచినీళ్లు తాగినంత సులభంగా ఇబ్బందులు గురిచేస్తున్నారు. ముఖ్యంగా కార్యాలయంలో కేంద్ర బడ్జెట్ మరియు రాష్ట్ర బడ్జెట్ కు సంబంధించిన నిధులను దోచిన కాడికి దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది అంతేకాకుండా అధికారులు ప్రజాప్రతినిధులు మాట వినకపోతే ఒక్క చరవాణి కాల్ ద్వారా జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి అధికారి తక్షణమే బదిలీ కావాలా లేక ఇన్చార్జి పదవిని పదులుకోవాలన్నది నిర్ణయించే స్థాయికి ఉంటుందంటే ఏ స్థాయిలో అధికారులు ఇబ్బందులు పడుతున్నారో తెలుస్తుందని కొందరు సీనియర్ సిటిజెన్లు సైతం తీవ్రంగా విమర్శిస్తున్నారు.

అధికారులకు అధికారులే శత్రువులు!?

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగాలంటే కొందరు ప్రజలకు దగ్గర కావడం కోసం నిజాయితీగా పనిచేస్తుంటారు మరికొందరు అక్రమ మార్గాన్ని పెంచుకొని ఏసీబీలకు పట్టుపడుతుంటారు ఈ రెండిటికీ కాకుండా మరికొందరు ప్రజాప్రతినిధులకు దగ్గర ఇవ్వటం కాంట్రాక్టర్ పనులను చేయించుకోవడం వంటి పనులలో పై స్థాయి అధికారులు కిందిస్థాయి అధికారులను టార్గెట్ చేసి కక్షాదింపులు పెట్టుకుని వేధింపులకు గురి చేయటం సర్వసాధారణం అవుతుంది చివరికి మాట వినకపోతే బదిలీ చేయటం తో ఆగకుండా ప్రభుత్వం నుంచి రావాల్సిన కొన్ని రకాల వసతులను సైతం బ్రేకులు చేపటం ప్రజాప్రతినిధులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది.

ప్రజా దానం తినేందుకు అందరూ సూత్రధారులే!?ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల లో భాగంగా నిధులు మింగేయటం కోసం ముఖ్యంగా ప్రజాప్రతినిధులే సూత్రధారులుగా వ్యవహరిస్తుంటారు దీనికి అధికారులను పాములా కదుపుతూ తమకు రావలసిన నిధులను రప్పించుకునేందుకు అధికారులను అనేక ఇబ్బందులకు గురిచేసి చివరికి వాటిని దండుకునేందుకు విష ప్రయత్నాలు చేస్తుంటారు. పంచాయతీలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాలలో ఐ టి డి ఈ నుండి వచ్చే నిధులను సైతం కాజేసేందుకు విష ప్రయత్నాలు కొనసాగిస్తుంటారు ఇటువంటి వాటిని కొందరి పంచాయతీ అధికారులు అడ్డగించిన వాటిని ఏదో రూపంలో కాజేసేందుకు అవసరమైతే జిల్లా అధికారులను సైతం తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు రాజకీయ నాయకులు సర్వత్ర ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటారు. అటువంటి వాటిలోని కొందరు నిజాయితీ గల అధికారులు తమ విధి నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకు బదిలీలు అయినా పర్వాలేదని మౌనం వహిస్తూ సమర్థించుకుంటారే తప్ప ఎదురు తిరిగే ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోతుందని సీనియర్ సిటిజన్లో సైతం ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఇటువంటి విధానానికి నాంది పలికితే ప్రజాధనాని పడే పరిస్థితి ఉంటుందని అశ్వారావుపేట మండల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తుంది.











ఎల్‌నినో ముప్పు ఒకవైపు.. హిమాయత్‌సాగర్‌లో జలదోపిడీ మరోవైపు

- నీటి ఎద్దడి పొంచి ఉన్నా ఆగని ట్యాంకర్ల వ్యాపారం
- వాల్టా చట్టం అమలు ఎక్కడ.?
- ప్రైవేట్ ట్యాంకర్లకు ఎన్ఓసిని,జిపిఎస్ తప్పనిసరి
- అధికారుల పర్యవేక్షణ ఏది.?
- జల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ ట్యాంకర్లపై పటిష్ట చర్యలు ఎప్పుడు.?
- అధికార యంత్రాంగం స్పందించి జలదోపిడీకి పాల్పడుతున్న వారిని కట్టడి చేసి జల వనరుల సంరక్షించాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

ప్రజావాయిస్|| రాజేంద్రనగర్: ఓ పక్క ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి పొంచి ఉందన్న ఆందోళనలు..మరోపక్క హిమాయత్‌సాగర్ పరిసరాల్లో నీటి వ్యాపారం జోరుగా సాగుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.భూగర్భ జలాలను బోర్ల ద్వారా తోడి భారీ ట్యాంకర్లలో తరలించి విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. హిమాయత్‌సాగర్ గ్రామ పరిసరాల్లో 2 వేల నుంచి 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు నిత్యం బహిరంగంగా తిరుగుతున్నాయని,ఒక్కో ట్యాంకర్‌కు రూ.1,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.నీటి సేకరణకు అనుమతులు ఉన్నాయా.? ఎన్ని బోర్ల ద్వారా నీటిని తోడుతున్నారు.? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వాల్టా చట్టం..2023 నిబంధనలు ఏమయ్యాయి.?

తెలంగాణ వాటర్,ల్యాండ్ అండ్ ట్రీస్(వాల్టా) చట్టం – 2002 ప్రకారం భూగర్భ జలాల వినియోగం,బోర్ల నమోదుపై నియంత్రణలు ఉన్నాయి.అంతేకాకుండా ప్రభుత్వం జీ.ఓ.ఎంఎస్.నం15,తేదీ 27-05-2023 ద్వారా తీసుకొచ్చిన భూగర్భ జలాల వెలికితీత నిబంధనల ప్రకారం బల్క్ వాటర్ సరఫరాదారులకు సంబంధిత అనుమతులు (ఎన్ఓసి),ట్యాంకర్ల పర్యవేక్షణకు జిపిఎస్ వంటి నిబంధనలు వర్తిస్తాయి. మరి హిమాయత్‌సాగర్ పరిసరాల్లో నీటిని తరలిస్తున్న ట్యాంకర్లకు ఎన్ఓసీలు ఉన్నాయా.? జిపిఎస్ పర్యవేక్షణ అమలవుతోందా.? అనే అంశాలపై అధికారులు తనిఖీలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జలవనరులను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే

భూగర్భ జలాలను అధికంగా తోడితే పరిసర గ్రామాలు,కాలనీల్లో నీటి మట్టాలు పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భూగర్భ జలాల శాఖ,రెవెన్యూ,జలమండలి అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.చట్టాలు ఉన్నాయి,నిబంధనలు ఉన్నాయి,అయినా హిమాయత్‌సాగర్ పరిసరాల్లో నీటి తరలింపుపై పర్యవేక్షణ ఏది.? జలవనరుల పరిరక్షణకు అధికారులు ఎప్పుడు మేల్కొంటారన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికైనా ఆయా శాఖల అధికార యంత్రంగా స్పందించి జల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ యాంకర్ల యజమానులపై చట్ట పరమైన చర్యలు తీసుకోని వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసి జల వనరులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





ఎల్‌నినో ముప్పు వేళ.. ప్రతి నీటి చుక్కా విలువైనదే

- నీరు, విద్యుత్ పొదుపులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- కూరగాయలు, బియ్యం కడిగిన నీటిని మొక్కలకు వినియోగించాలి
- తాగునీటి శుద్ధి యంత్రం నుంచి వచ్చే నీటినీ వృథా చేయొద్దు
- కుళాయిల లీకేజీలను అరికట్టి నీటి వృథాను తగ్గించాలి
- వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఇంటా ప్రాధాన్యం ఇవ్వాలి
- ఏసీతోపాటు ప్రతి విద్యుత్ ఉపకరణాన్ని పొదుపుగా వినియోగించాలి
- చిన్నచిన్న జాగ్రత్తలతో భవిష్యత్తు అవసరాలకు భరోసా

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / ప్రతినిధి: వాతావరణ మార్పుల ప్రభావంతో ఎండలు, నీటి కొరత వంటి సమస్యలు ఎదురయ్యే పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను విలువైనదిగా భావించాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో ప్రభావం బలపడే అవకాశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో నీరు, విద్యుత్ వినియోగంలో ఇప్పటి నుంచే పొదుపు అలవాట్లను పాటించడం మంచిది. నీటి వృథాను అరికట్టడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత కూడా. ఇంటి నుంచే చిన్నచిన్న మార్పులు ప్రారంభిస్తే పెద్ద మొత్తంలో నీరు, విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

వంటింటి నుంచే నీటి పొదుపు ప్రారంభం

ఇంట్లో ఎక్కువగా నీరు వినియోగించే ప్రదేశాల్లో వంటగది ఒకటి. కూరగాయలు, బియ్యం కడిగేటప్పుడు అవసరానికి మించి నీటిని వాడకుండా జాగ్రత్తపడాలి. కూరగాయలు, బియ్యం కడిగిన నీటిని పారబోయకుండా మొక్కలకు పోయవచ్చు. అయితే ఈ నీటిని తిరిగి వంటకు లేదా ఆహార తయారీకి వినియోగించకూడదు. కేవలం మొక్కలకు ఉపయోగించడం ద్వారా తాగునీటి వృథాను కొంతవరకు తగ్గించవచ్చు. పాత్రలు శుభ్రం చేసేటప్పుడు కుళాయిని నిరంతరం తెరిచి ఉంచకుండా అవసరమైనంత నీటినే వినియోగించాలి.

తాగునీటి శుద్ధి యంత్రం నుంచి వచ్చే నీటినీ వృథా చేయొద్దు

ఇళ్లలో తాగునీటిని శుద్ధి చేసే యంత్రాల నుంచి శుద్ధి ప్రక్రియలో కొంత నీరు బయటకు వస్తుంది. చాలామంది ఈ నీటిని నేరుగా పారబోస్తుంటారు. అలా చేయకుండా నేల తుడవడం, మరుగుదొడ్డి శుభ్రం చేయడం, వాహనాలు కడగడం వంటి పనులకు ఉపయోగించుకోవచ్చు. ఇలా ఇంట్లో లభించే నీటిని దాని వినియోగానికి తగిన పనులకు మళ్లించడం ద్వారా వృథాను తగ్గించవచ్చు.

కారుతున్న కుళాయిలను వెంటనే బాగుచేయాలి

కుళాయిల నుంచి చుక్కలుగా నీరు కారుతున్నా చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ నిరంతరం కారే నీరు రోజులు గడిచేకొద్దీ గణనీయమైన వృథాకు దారితీస్తుంది. ఇంట్లోని కుళాయిలు, పైపులు, నీటి ట్యాంకుల వద్ద లీకేజీలు ఉన్నాయేమో తరచూ పరిశీలించాలి. మర మ్మతులు అవసరమైతే వెంటనే చేయించాలి. ట్యాంకు నిండిన తర్వాత మోటారు ఆపకుండా వదిలేయడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుంది. నీటి మోటార్లను అవసరమైన సమయానికే నడిపేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం

వర్షం పడినప్పుడు పెద్ద మొత్తంలో నీరు కాలువల్లోకి వెళ్లి వృథా అవుతుంది. ఆ నీటిని ఒడిసిపట్టే విధంగా ఇళ్లలో వర్షపు నీటి సంరక్షణ ఏర్పాట్లు చేసుకోవాలి. ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని పైపుల ద్వారా ఇంకుడు గుంతల్లోకి మళ్లించవచ్చు. దీనివల్ల భూగర్భ జలాలు పెరగడానికి తోడ్పాటు లభిస్తుంది. అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర భవనాల్లోనూ వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే కొరతను కొంతవరకు తగ్గించవచ్చు.

విద్యుత్ పొదుపుతో తగ్గనున్న వినియోగ భారం

నీటి పొదుపుతోపాటు విద్యుత్ వినియోగంలోనూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. ఇంట్లో ఉపయోగించే ఏసీ, టీవీ, ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్ తదితర విద్యుత్ ఉపకరణాలను అవసరమైనప్పుడే వినియోగించాలి. గదిలో ఎవరూ లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆపేయాలి. టీవీ చూసిన తర్వాత రిమోట్‌తో స్టాండ్‌బైలో ఉంచకుండా స్విచ్ ఆఫ్ చేయాలి. ఫోన్ ఛార్జింగ్ పూర్తయిన తర్వాత ఛార్జర్‌ను విద్యుత్ బోర్డు నుంచి తొలగించాలి. అవసరం లేని సమయంలో ఏ ఉపకరణాన్నీ ఆన్‌లో ఉంచకూడదు. ఈ చిన్నచిన్న అలవాట్లు విద్యుత్ వినియోగాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

విద్యుత్ ఆదాకు ఉపకరణాల వినియోగంలో ప్రత్యేక జాగ్రత్తలు

వేసవిలో ఏసీ వినియోగం పెరుగుతుంది. చాలామంది గది త్వరగా చల్లబడాలనే ఉద్దేశంతో ఉష్ణోగ్రతను 18 లేదా 20 డిగ్రీలకు తగ్గిస్తుంటారు. అయితే ఏసీని 24 డిగ్రీల వద్ద ఉంచడం ద్వారా సౌకర్యవంతమైన వాతావరణంతోపాటు విద్యుత్ ఆదా చేసే అవకాశం ఉంటుంది. గది ఖాళీగా ఉన్నప్పుడు ఏసీని ఆపేయడం, తలుపులు, కిటికీలు మూసి ఉంచడం వంటి జాగ్రత్తలూ అవసరం. ఫ్రిజ్‌ను పదేపదే తెరవడం, తలుపును ఎక్కువసేపు తెరిచి ఉంచడం వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతుంది. అవసరమైన వస్తువులను ముందుగానే నిర్ణయించుకుని ఒకేసారి తీసుకోవాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను వెంటనే ఫ్రిజ్‌లో పెట్టకుండా కొంత చల్లారిన తర్వాత ఉంచాలి. ఫ్రిజ్‌లో అవసరానికి మించి వస్తువులను కుక్కేయకుండా గాలి ప్రసరణకు వీలుండేలా చూసుకోవాలి. ఫ్రిజ్ తలుపు సరిగా మూసుకుపోతుందో లేదో కూడా పరిశీలించాలి. టీవీ, ఫ్యాన్లు, లైట్లు వంటి ఇతర ఉపకరణాలనూ అవసరం లేనప్పుడు పూర్తిగా ఆపేయాలి. ఛార్జింగ్ పూర్తయిన తర్వాత ఛార్జర్‌ను తొలగించాలి. ఇలా ప్రతి విద్యుత్ ఉపకరణాన్ని అవసరానికి తగినట్టుగా వినియోగించడం ద్వారా విద్యుత్ వృథాను తగ్గించవచ్చు.

పొదుపు అలవాటే భవిష్యత్తుకు భరోసా

నీరు, విద్యుత్ వంటి సహజ వనరులు అపరిమితమైనవి కావు. వాటిని అవసరానికి మించి వినియోగిస్తే భవిష్యత్తులో కొరత సమస్యలు మరింత తీవ్రం కావచ్చు. అందుకే పొదుపును ఒకరోజు కార్యక్రమంగా కాకుండా రోజువారీ జీవనశైలిలో భాగం చేసుకోవాలి. ఇంట్లో పిల్లలకు కూడా నీరు, విద్యుత్ విలువను వివరించి చిన్నప్పటి నుంచే బాధ్యతాయుతమైన అలవాట్లు నేర్పాలి. ప్రతి ఇంట్లో ఒకరు పాటించే జాగ్రత్త మరెందరికో ఆదర్శంగా మారుతుంది. ప్రభుత్వం చేపట్టే సంరక్షణ చర్యలకు ప్రజల భాగస్వామ్యం తోడైతేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. ఎల్‌నినో ప్రభావం ఎలా ఉన్నా, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం మనందరి బాధ్యత. ప్రతి నీటి చుక్కను కాపాడుకుందాం.. ప్రతి యూనిట్ విద్యుత్‌ను ఆదా చేద్దాం.

సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ కన్నుమూత

- మంథనిలో విషాద ఛాయలు
- జర్నలిస్టు వర్గంలో తీరని లోటు




ప్రజా వాయిస్ మంథని మంథని ప్రెస్ క్లబ్ సీనియర్ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ (47) అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో మంథని జర్నలిస్టు వర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రామ్ కుమార్ విద్యార్థి దశ నుంచే పలు సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం మంథని కేంద్రంగా సుదీర్ఘకాలం వివిధ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు. పేద ప్రజల సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేస్తూ వారి గొంతుకగా నిలిచారు. సామాజిక స్పృహ, నిజాయితీ, నిర్భయ జర్నలిజం ఆయన ప్రత్యేకతలుగా నిలిచాయి. మంథనిలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో, సమస్యల పరిష్కార పోరాటాల్లో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. ఆయన మరణం జర్నలిస్టు రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా పలువురు పేర్కొన్నారు.

పలువురి సంతాపం

పెండ్యాల రామ్ కుమార్ మృతిపట్ల మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, ఉపాధ్యక్షుడు బర్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం అంజిబాబు, కోశాధికారి తగరం రాజు, సీనియర్ జర్నలిస్టులు కొమురోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, అంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, ఆర్ల బాపు, లక్కాకుల నాగరాజు, బాసాని సాగర్, ఓజ్జల శ్రీనివాస్, లింగాల సురేష్, దొరగోర్ల రవీందర్, కేసారపు రవి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కూడా రామ్ కుమార్ మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శాతవాహన విశ్వ విద్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న లా విద్యార్థిని



ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 01): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎల్ ఎల్ బి ద్వితీయ సంవత్సరం చదువుతున్న దక్కాలి చంద్రకళ (28) ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి షాద్ నగర్ కి చెందిన చంద్రకళ మధ్యాహ్నం తోటి విద్యార్థులు భోజనం చేయడానికి రమ్మంటు తలుపు కొట్టిన తీయకపోవడంతో సెక్యూరిటి కి తెలుపగా తలుపులు పగలగొట్టి చూడా అప్పటికే గదిలోని ఉరివేసుకొని ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె మెడలో ఇయర్ ఫోన్స్ ఉండటంతో కాల్ మాట్లడుతూ ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కొత్తపల్లి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్నీ పోస్టుమార్టం నిమిత్తము జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు దర్యాప్తు అనంతరం తెలియనుంది.

అక్రమ కేసులతో కమ్యూనిస్టులను అణిచివేయలేరు

- సీపీఐ ప్రజా పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ క్షమాపణ చెప్పాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్

ప్రజా వాయిస్ గోదావరిఖని

రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నిస్తూ నిరసన తెలిపిన సీపీఐ నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గమని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయడం, వారిని బలవంతంగా లాక్కెళ్లడం, బట్టలు చింపి కింద పడేయడం వంటి చర్యలను తీవ్రంగా ఖండించారు.



ప్రజాపాలన పేరుతో పోలీసు వ్యవస్థను ఉపయోగించుకొని గుండాల రాజ్యాన్ని తలపించేలా పాలన సాగించడం సరికాదని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ నాయకులను అరెస్టు చేయించినందుకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండం ప్రజలు గుండాయిజాన్ని సహించరని, ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులను అగౌరవపరిచేలా పోలీసులను ఉపయోగించుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజలు, చట్టాలు, రాజ్యాంగం పట్ల గౌరవంతో వ్యవహరించాలని సూచించారు. బాధ్యతాయుతమైన సీఐ పదవిలో ఉన్న ఇంద్రసేనారెడ్డి ప్రజా పోరాటాలు చేసే నాయకులతో గౌరవప్రదంగా వ్యవహరించాలని కోరారు. దొంగలు, గుండాలతో వ్యవహరించినట్లుగా ప్రజా ఉద్యమకారుల పట్ల ప్రవర్తించడం తగదని, ఈ విధానాన్ని మానుకోవాలని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసిన వారిలో సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, మాజీ ఫ్లోర్ లీడర్ నారాయణదాసు మారుతి, బీఆర్ఎస్ 41వ డివిజన్ ఇన్‌చార్జి నీరటి శ్రీనివాస్, సీపీఐ నాయకులు రాణవేణి సుధీర్ కుమార్, ఆసాల నవీన్, పోతరాజు నాగరాజు, మార్కపురి భగత్ తదితరులు ఉన్నారు.

అండర్-17 రాష్ట్రస్థాయి క్రికెట్‌లో సత్తా చాటిన నేరడిగొండ విద్యార్థి విద్యావర్ధన్‌కు ఘన సన్మానం

జడ్పీహెచ్ఎస్ నేరడిగొండ పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందించిన హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

ఇచ్ఛోడా సన్‌రైజ్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీలలో మైదానంలో రాణించిన వైనం

గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సరైన శిక్షణ ఇస్తే జాతీయ స్థాయిలో రాణించగలరని కోచ్ షేక్ అమాన్ వెల్లడి

ప్రజా వాయిస్, నేరడిగొండ / బోథ్ నియోజకవర్గం



ఇచ్ఛోడా సన్‌రైజ్ క్రికెట్ అకాడమీలో సుదీర్ఘంగా శిక్షణ పొందుతున్న యువ క్రీడాకారుడు విద్యావర్ధన్ అండర్-17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అద్భుత ప్రతిభను కనబరిచి అకాడమీతో పాటు తను చదువుతున్న పాఠశాలకు విశేష గుర్తింపు తీసుకువచ్చాడు. ఈ ఘనత సాధించిన సందర్భంగా ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో విద్యావర్ధన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎల్. పద్మ, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తూ పాఠశాల కీర్తిని పెంచడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ క్రికెట్ అకాడమీ ముఖ్య కోచ్ షేక్ అమాన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులకు సరైన ప్రణాళికతో శిక్షణ, నిరంతర ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించగలరని విద్యావర్ధన్ విజయం నిరూపించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్ రమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు (పీడీ) జాదవ్ జగదీష్, ఆనంద్ బాబు, ఫిరోజ్, బోధన సిబ్బంది మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ దుష్ప్రచారానికి బీజేపీ కౌంటర్

ఎన్నికల వ్యవస్థలపై అనుమానాలు సృష్టించడం మానుకోవాలి

ఎల్బీ స్టేడియం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుండి కొనసాగనున్న మహా పాదయాత్ర

ముఖ్య అతిథిగా పాల్గొననున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

బీజేపీ నేతలు కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన గోల్కొండ-గోషామహల్ జిల్లా ఇంచార్జ్ వై.శ్రీధర్

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా,కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజల్లో ఎండగట్టేందుకు బీజేపీ భారీ మహా పాదయాత్రకు సిద్ధమైంది.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ గోల్కొండ - గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై.శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ..సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు లాల్‌బహదూర్ స్టేడియం వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా,రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు



వెల్లడించారు.ఎన్నికల్లో ఓటమి ఎదురైన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలు, ఎన్నికల సంఘం,ఎస్ఐఆర్ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రశ్నిస్తోందని విమర్శించారు.రాజ్యాంగ విలువలను కాపాడాలనే నినాదంతో చేపడుతున్న ఈ మహా పాదయాత్రలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిటి స్వామి సేవలు చిరస్మరణీయం.. విరామం ఎరుగని శ్రామికుడు

గోదావరిఖనిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం: మాజీ మంత్రి హరీష్ రావు

ప్రజా వాయిస్ గోదావరిఖని

తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన పిటి స్వామి విరామం ఎరుగని శ్రామికుడని, ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి, సింగరేణి కార్మిక లోకానికి తీరని లోటని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిటి స్వామి మృతికి సంతాపంగా ఆదివారం గోదావరిఖనిలోని ఆర్కే గార్డెన్స్‌లో నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిటి స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచి చివరి శ్వాస వరకు పార్టీలోనే కొనసాగిన నిబద్ధత కలిగిన నాయకుడు పిటి స్వామి అని కొనియాడారు. పేదల పక్షపాతిగా, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, పారిశ్రామిక ప్రాంతంలో పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత గౌరవించే నాయకుల్లో పిటి స్వామి ఒకరని గుర్తుచేశారు. 80 ఏళ్ల వయసులోనూ కార్మికుల సమస్యలపై



పోరాడుతూ, వృద్ధుల సంక్షేమం కోసం ఆశ్రమాన్ని నిర్వహించడం ఆయన సేవా నిరతికి నిదర్శనమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. పిటి స్వామి సేవలను చిరస్మరణీయం చేసేలా గోదావరిఖని నగరంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హరీష్ రావు ప్రకటించారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పూర్తి బాధ్యతను పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా పిటి స్వామి కొనసాగించిన ఈశ్వర కృప వృద్ధాశ్రమం నిర్వహణకు కూడా తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పిటి స్వామి అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. 7ఎల్‌పీ బొగ్గు గనిలో ప్రమాదం జరిగినప్పుడు కార్మికులకు న్యాయం చేయాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌ను అడ్డుకుని నిరసన తెలిపిన ఘటనలో తనతో పాటు పిటి స్వామి జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు పిటి స్వామి అని, ఆయన మరణం వ్యక్తిగతంగా తనకు, పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం, తెలంగాణ ఉద్యమం కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకుడని పేర్కొన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ....టీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి, సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణకు పిటి స్వామి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన తనకు తండ్రి సమానులని, పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ ముందుండేవారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధుకర్, కోలేటి దామోదర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు కొంకటి లక్ష్మీనారాయణ, వడ్డపల్లి శంకర్, రఘువీర్ సింగ్, రేణిగుంట్ల ప్రవీణ్, రామ్మూర్తి, కౌశిక్ హరి, వ్యాల హరీష్ రెడ్డి, మూల విజయ రెడ్డి, జేవీ రాజు, పార్లపల్లి రవితో పాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

పట్టభద్రులారా.. మీ ఓటే మీ గొంతుక

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకం కానున్న గ్రాడ్యుయేట్ ఓటు

కిస్మత్‌పూర్‌లో ఓటరు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన బీజేపీ నేత నీరుడు పవన్ సాయి

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

పట్టభద్రుల ఓటు హక్కుకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం కిస్మత్‌పూర్‌లో ప్రారంభమైంది.స్థానిక అపోలో ఫార్మసీ సమీపంలో బీజేపీ నేత నీరుడు పవన్ సాయి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ,నమోదు ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.ఈ సందర్భంగా పవన్ సాయి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి అర్హుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఎన్నికల సమయంలో ఓటు వేయాలనే ఆసక్తి మాత్రమే కాకుండా,ముందుగానే ఓటరుగా నమోదు చేసుకోవడం కూడా బాధ్యతేనని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ నమోదు చేసుకోకపోతే తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయే పరిస్థితి ఉంటుందని వివరించారు.అందువల్ల పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,ఓటరు నమోదు కార్యక్రమానికి సహకరించాలని పవన్ సాయి విజ్ఞప్తి చేశారు..

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రేపు కలెక్టరేట్ ముట్టడి: ధర్నాకు పిలుపు

ఇతర రాష్ట్రాల కూలీలతో స్థానికులకు పనులు కోల్పోతున్నారంటూ కార్మిక సంఘాల ఆందోళన

చట్ట ప్రకారం 70 శాతం స్థానిక కార్మికులకే అవకాశాలు కల్పించాలని అధికారులకు డిమాండ్

కాంట్రాక్టర్లతో మాట్లాడి న్యాయం చేయకపోతే జిల్లావ్యాప్తంగా పనులు బంద్ చేస్తామని హెచ్చరిక

ప్రజా వాయిస్, ఆదిలాబాద్

భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న స్థానిక కార్మికుల ఉపాధి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం (నవంబర్ 2న) కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు కార్మిక సంఘ నాయకులు వెల్లడించారు. మేస్త్రీ, ఎలక్ట్రీషియన్, టైల్స్, మార్బుల్, గ్రైనైట్, పెయింటర్, రాడ్ బెండింగ్, సెంట్రింగ్ వంటి రంగాలలో పనిచేస్తున్న స్థానిక కార్మికులకు ఇతర రాష్ట్రాల కూలీల వల్ల ఉపాధి లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, బిల్డర్లు తక్కువ వేతనాలకే ఇతర ప్రాంతాల వారిని నియమించుకుంటూ స్థానికుల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు.లేబర్ యాక్ట్ నిబంధనల ప్రకారం నిర్మాణ రంగంలో 70 శాతం పనులు స్థానిక కార్మికులకే కల్పించాలని, మిగిలిన 30 శాతం మాత్రమే ఇతర రాష్ట్రాల సాంకేతిక నిపుణులకు ఇవ్వాలనే జీవోను కాంట్రాక్టర్లు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి కాంట్రాక్టర్లు, బిల్డర్లు, ఇంజనీర్లతో సంప్రదింపులు జరిపి స్థానికులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్, లేబర్ అధికారులకు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.



స్పందించని పక్షంలో జిల్లావ్యాప్తంగా భవన నిర్మాణ పనులన్నింటినీ స్తంభింపజేసి నిరవధిక ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

వాల్మీకి మహర్షి ఆశయాలను కొనసాగించాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి
- అనంతగిరిపల్లిలో ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ప్రజావాయిస్/వికారాబాద్:



వికారాబాద్ పట్టణంలోని 10వ వార్డు అనంతగిరిపల్లిలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి హాజరై వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అర్థ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆదికావ్యమైన రామాయణాన్ని రచించి, సమాజానికి ధర్మం, నీతి, సత్యం వంటి గొప్ప విలువలను బోధించిన మహర్షి వాల్మీకి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహర్షి చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం, ధార్మిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, సోషల్ మీడియా ప్రతినిధి నందు, బోయ బాలరాజు, కురువ శీను, బాబు నాయక్, మోహన్ నాయక్, నర్సింలు, వార్డు ప్రజలు, వాల్మీకి సంఘం యువకులు, పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శలకే పరిమితమైన నాయకులు..

ఆపదలో అండగా నిలిచిన చంద్రప్రియ!

మాటలు కాదు.. చేతల్లో చూపించిన మానవత్వం

ప్రజావాయిస్/మోమిన్ పేట్:

ఆపద సమయంలో పరామర్శించి వెళ్లిపోవడం కాదు.. బాధితులకు అండగా నిలవడమే నిజమైన మానవత్వం. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని వెల్చాల్ గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా చర్చి పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ చర్చిని సందర్శించి పరిశీలించారు. అనంతరం చర్చి పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేసి సంఘ సభ్యులకు భరోసా కల్పించారు. భవిష్యత్తులోనూ మన చంద్ర ఫౌండేషన్ మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం వారితో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. చాలామంది నాయకులు వచ్చి పరామర్శించి వెళ్లినప్పటికీ తక్షణ సహాయం అందించలేదని, కష్టకాలంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన చంద్రప్రియ సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా చంద్రప్రియకు సంఘ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సర్పంచ్ కమలమ్మ చెన్నయ్య

బోడంపహాడ్‌లో ఉత్సాహంగా ప్రారంభమైన BPL-6 క్రికెట్ టోర్నమెంట్

(ప్రజా వాయిస్ షాబాద్)

నేటి యువత దురలవాట్లకు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలి గ్రామంలో ప్రతి ఒక్కరూ నిత్యం ఆటలాడుతూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని బోడంపహాడ్ గ్రామ సర్పంచ్ కమలమ్మ చెన్నయ్య పిలుపునిచ్చారు రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహించిన బోడంపహాడ్ ప్రీమియర్ లీగ్ – సీజన్ 6 క్రికెట్ టోర్నమెంట్ కోలాహలంగా ప్రారంభమైంది. గ్రామంలోని స్థానిక క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నీని సర్పంచ్ కమలమ్మ చెన్నయ్య, గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ కమలమ్మ చెన్నయ్య మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా క్రీడల వైపు మళ్లాలనే ఉద్దేశంతో ధూమ-6 నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి, గ్రామీణ యువతకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు ఈ టోర్నమెంట్‌లో మొత్తం 5 జట్లు పాల్గొని ట్రోఫీ కోసం తలపడుతున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లలో క్రీడాకారులు ఫోర్లు సిక్సర్లతో విరుచుకుపడుతూ ఉత్సాహంగా ఆడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కల్లెం శ్రీనివాస్, వార్డు మెంబర్ సి. శ్రీనివాస్, మాజీ సర్పంచ్, గ్రామ యువకులు, టోర్నమెంట్ నిర్వాహకులు మరియు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పట్టణంలోగంజాయితాగుతున్న యువకుని అరెస్ట్-గంజాయి స్వాధీనం

టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి

ప్రజా వాయిస్ ,మహబూబాబాద్

పట్టణ పరిధి లోని జి. ఎస్. టీ ఆఫీస్ వెనకాల కొందరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి మరియు ఎస్ఐ గడ్డం ఉమ తమ సిబ్బందితో కలిసి రైడ్ చెయ్యగా బోడ పవన్, తండ్రి కిషన్, 26 సం, వృత్తి: స్టూడెంట్, తోకబోడు తండా, మల్యాల అనే వ్యక్తి దగ్గర సుమారు 32 గ్రాముల ఎండు గంజాయి తో పాటు ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకోవడం జరిగింది, బోడ పవన్ ని విచారించగా భూక్యా ఆదిత్య, మిల్టీ కాలనీ, బాధవత్ వినోద్, బాబూనాయక్ తండా, అజ్మీరా కుమార్, మంగలి కాలనీ మరియు ఐలబోయిన నరేష్ అనే వ్యక్తులు పోలీస్ వారిని చూసి పారిపోయారని, తాను తాళ్ల అభిషేక్, మంగలికాలనీ మరియు మంజుల అనిల్ కుమార్, లెనిన్ నగర్ అనే వక్తుల దగ్గర గంజాయి కొని పారిపోయిన వ్యక్తులకు మరియు ఇతర కొంతమంది వ్యక్తులకు అమ్ముతుంటానని తెలిపాడు. పారిపోయిన నిందితుల కొరకు ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం మరియు రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, యువత మత్తుకు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దని, ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షులుగా ఆవునూరి రమేష్..
గౌరవ అధ్యక్షులుగా బొల్లి నరసయ్య
- ప్రధాన కార్యదర్శిగా ఆరెపల్లి రత్నం ఎన్నిక

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆరెపల్లి రత్నం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సభ్యులందరి ఏకాభిప్రాయంతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా సుద్దాల గ్రామానికి చెందిన ఆవునూరి రమేష్, గౌరవ అధ్యక్షులుగా బొల్లి నరసయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా న్యాతరి దేవేందర్ కుమార్, క్యాదాసి రమేష్, ఓగుల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆరెపల్లి రత్నం, జాయింట్ కార్యదర్శిగా కస్తూరి రాజు, ప్రచార కార్యదర్శులుగా



కల్వల మహేష్, న్యాతరి రాజేందర్, కోశాధికారిగా కొడిపాక సతీష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎండీ అజ్జు, ఆరెపల్లి అమర్, కుడుదుల రమేష్, క్యాదాసి లచ్చయ్య, గున్నాల శ్రీనివాస్, ఇరుగురాల మల్లేష్, న్యాతరి మహేందర్, కల్వల రంగయ్య, ముక్క బాబురావు, ప్రతాప్, శ్రీనివాస్, క్యాదాసి శంకరయ్య, కుడుదుల సాయిరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆవునూరి రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సంఘం అభివృద్ధికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులను పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా కాట్నపల్లి గ్రామానికి చెందిన ఓగుల రాజేందర్ నూతన కమిటీని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓగుల రాజేందర్, ఎదుల్ల శంకరయ్య, ఆరెపల్లి రాయమల్లు, తిప్పారపు దివాకర్, నరసయ్య, ప్రతాప్, రాజు, ఆసంపల్లి శంకరయ్యతో పాటు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మెకానికలను అసంఘటిత కార్మికులుగా గుర్తించి,మెకానిక్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి బాబు

ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :

యాదాద్రి భువనగిరిజిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర అల్ టూ-వీల్లర్స్ మెకానిక్ వెల్ఫ్ ర్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భువనగిరి మునిసిపల్ చైర్మన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవికుమార్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి బాబు మాట్లాడుతూ టూ వీలర్ మెకానికులమైన మేము చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను పోషించుకోలేక దుర్భరమైన జీవితాలను గడుపుతున్నాం అదేవిధంగా వృత్తిలో భాగంగా ఆయిల్ గ్రీస్ పెట్రోల్ పొగవలన మేము త్వరగా అనారోగ్య పాలై అవస్థలు పడుతున్నాము దీనికి ఖరీదైన వైద్యంచేయించుకునే స్థితిలో మా మెకానిక?న్ లేరు ఎవరైనా మెకానికులు ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకునే నాధుడు లేడు ఉన్నంతవరకు మెకానిక్ పని చేసి వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఏ పని చెయ్యాలో తెలియక కుటుంబం పోషించలేక వేదన కృంగిపోతున్నాము కావున మా సమస్యలను ప్రభుత్వం ద్వారా పదివేల పింఛన్ ఇప్పించాలని కోరుతున్నాను. ఆటో మొబైల్ స్పెర్ పార్ట్స్ పై



మెకానిక్ కోసం సెస్ పన్ను 3% విధించి మెకానిక్లకు కల్పించాలి. మెకానిక్ షాపునకు ఉచితంగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలి. షోరూం నుండి విడుదలైయ్యే కొత్త వాహనాలకు మెకానిక్ కు సెస్పన్ను విధించి ఆ పన్ను ద్వారా సమకూరిన ఆదాయంతో మెకానిక్ కు ప్రత్యేక సంక్షేమ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి. పని చేసే ప్రతి మెకానిక్కు కనీస వేతనాల చట్టం తీసుకురావాలి. హైదరాబాద్లో మెకానిక్ల కోసం వృత్తి విద్యా కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి. దీని కోసం ఒక ఎకరం స్థలం కేటాయించి ప్రభుత్వం ద్వారా ఒక భవనాన్ని నిర్మించి ఇవ్వాలి. కొత్త టెక్నాలజీతో వచ్చే వాహనాలను కంప్యూటర్ ద్వారా రిపేర్ చేయుటకు మెకానిక్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. మెకానిక్ షాపుల ఏర్పాటు చేసుకోవడానికి మెకానిక్స్కు సబ్సిడీ కూడిన రుణాలు మంజూరు చేయాలి. జిల్లాలతో పాటుగా మండలమును ఒక యూనిట్గా పరిగణించి ప్రతి మండల కేంద్రంలో మెకానిక్ల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. ప్రతి జిల్లాలో, మండలాలలో టూవీలర్ మెకానిక్ కోసం "ఆటోనగర్" ఏర్పాటు చేయాలి. నిరక్షరాస్యత, పేదరికంలో మగ్గుతున్నవారే మెకానిక్లుగా మారుతున్నారు. కాబట్టి విద్యార్హతతో సంబంధం లేకుండా ఆధార్కార్డుతో మెకానిక్లకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయాలి. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ జిల్లా మరియు మండలాల ప్రెజిడెంట్లు మరియు సెక్రెటరీలు, బాడీమెంబర్స్, మెకానిక్ సోదరులు ఉ సర్వో ఆయిల్ కంపనీ ప్రతినిధులు పాల్గొన్నారు

గోండుమన్యంవీరుడు కుంమ్రం భీం 86 వ వర్ధంతివేడుకలు

.ఆదివాసిస్వయం పాలన ఉద్యమ సారథి -కుంమ్రం భీం
.ఘనంగా భీమ్ కు నివాళి అర్పించిన ఆదివాసి సంఘాలు

ప్రజా వాయిస్ కొత్తగూడ

ఆదివాసి హక్కుల కోసం ఆదివాసి ప్రజల స్వేచ్ఛ స్వతంత్రం కోసం పోరాడి అమరుడైన గోండ్ వీరుడు కుంమ్రం భీం 86 వ వర్ధంతి కార్యక్రమాన్ని కొత్తగూడ మండల కేంద్రంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదివాసి ఉద్యోగ సంఘాలు ఆదివాసి ప్రజలు వర్ధంతి సందర్భంగా భీం విగ్రహానికి పూలమాలలు వేసుకొని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ ఉద్యమ నాయకులు మాట్లాడుతూ...ప్రపంచ చరిత్రలో ఆదివాసి పోరాటాలు అపూర్వమైనవి అవన్నీ భూమి కోసం భుక్తి కోసం స్వయంపాలన కోసం జరిగినవి కొండ కోనల్లో ప్రకృతి తో సహజీవనం సాగించే గిరి పుత్రులు ఆదివాసీలు అడవి పై పూర్తి హక్కు కోసం వారి సామాజిక న్యాయం కోసం పోరాడారు. భారతదేశ నికి ఆంగ్లేయులు రాకపూర్వమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర మధ్యప్రదేశ్ ఒడిస్సా రాష్ట్రాల పరిధిలో కీ.శ. 1240 కీ.శ. 1749 మధ్య గొండ్వాన రాజ్యలు ఏర్పడ్డాయిఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేరిమేరి మండలం సాంకేపల్లి అనే గోండ్ గూడెంలో 1900సంవత్సరంలో కుశీమ్రశీ చిన్ను -సోంబాయి దంపతులకు భీం జన్మించాడు.భీం చిన్నతనం నుండి జంగ్లాత్ పోలీస్ పటేదార్లు షావుకార్ల విషం కూరల్లో గోండులు ఆదివాసీలు ఏ విధంగా నలిగిపోతున్నారో చూస్తూ పెరిగి పెద్దవాడయ్యాడు. అధికారుల దౌర్జన్యాలు షావుకారుల దోపిడీ నుండి భూమికోసం మనుగడ కోసం ఒక గ్రామం నుండి ఒక గ్రామం కు తిరిగాడు. ఆ పరిస్థితుల్లో భీం తండ్రి చిన్ను మరణించారు.భీం కుటుంబం సశేకేపల్లి వదిలి ఆసిఫాబాద్,ధానోరా,సర్దాపూర్ వెళ్ళింది. అక్కడే అడవులు నరికి చదును చేసి వర్షాలు పడగానే పోడు వ్యవసాయం చేసేవారు.పంట చేతికి వచ్చే సమయానికి నిజాం పట్టేదారులు జాంగ్లాత్ వాళ్ళు సుంకారి వచ్చి భూమి మాది అని దౌర్జన్యం చేసేవారు. ఆదివాసిలు సహించలేక



తిరుగుబాటు చేశారు ఈ తిరుగుబాటులో సిద్దిక్ సాబ్ కొమరం భీమ్ చేతిలో హతమయ్యాడు.కొన్నాళ్లు అస్సాం పారిపోయిన బీమ్ అక్కడ జరుగుతున్న అన్యాలపై పోరాటాలు తిరుగుబాటులపై అవగాహన పెంచుకొని చదువుకొని ఇంగ్లీష్ హిందీ ఉర్దూ భాషలు నేర్చుకొని తన జాతి పై జరుగుతున్న అన్యాలని ఎదిరించడానికి తిరిగి తన గోండ్ గూడెం కి చేరుకున్నాడు.ఇక్కడికి వచ్చాక చూస్తే గోండ్ లపై జరుగుతున్న అన్యాలని చూస్తూ సహించలేకపోయడు.అడవిలో పుట్టాం అడవిలో పెరిగాం ఈ గాలి నీరు ఎండ వాన మనవి అయినప్పుడు ఈ అడవిలో ఉన్న సంపద మనది ఎందుకు కాదు అని 12 ఆదివాసి గూడాలని ఏకం చేసి భూ పోరాటానికి గోండు ఆదివాసి యువకుల తో భీం గెరిల్లా సైన్యం ఏర్పాటు చేశాడు. స్వతంత్ర గోండ్ రాజ్యం కావాలని ప్రకటించాడు తుడుం మోగించి రగల్ జెండా ఎగరవేశాడు ఆకలితో బక్క చిక్కి ఉన్న గోండ్ లు ఆదివాసులు ఏమాత్రం వెనక్కి రాకుండా భీం మాటలతో భూమికోసం భుక్తి కోసం జాతి విముక్తి కోసం ప్రాణాలర్పించైన రానున్న భావితరాలకు బంగారు బాటలు వేయాల్సిందిగా భీం చెప్పిన మాటలు జల్ జంగిల్ జమీన్ హమారా మావ నాటే మావ రాజ్ అంటూ నినాదాలతో ఇచ్చిన పిలుపుతో ఆదివాసి ప్రజలు భీం గేరిల్ల తిరుగుబాటుకు మద్దతు నిలిచారు.భీం పిలుపుతో ఆదివాసీలందరూ ఏకమై నిజాం సైన్యంతో పెద్ద ఎత్తున గేరిల్ల వార్ కొనసాగుతున్న సమయంలో నిజాం ప్రభువు తన వక్రబుద్ధితో ఒక దొంగ ఇచ్చిన సమాచారంతో కొమరం భీమ్ ఉన్న సమాచారాన్ని తెలుసుకొని అక్కడికి తన సైన్యాన్ని పంపించి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా కొమరం భీం మరియు అతని సైన్యంపై ఎదురు కాల్పులు జరపడం తో హోరా హోరీగా జరిగిన ఏదురుకాల్పుల్లో భీం తో సహా మరి కొంతమంది ఆదివాసులు ఎదురు కాల్పుల్లో వీరమరణం చెందడు.కొమరం భీమ్ అంటే ఒక్క పోరాట యోధుడు మాత్రమే కాదు ఆదివాసుల స్వేచ్ఛా గీతం జాతి స్వేచ్ఛ కోసం జల్ జంగిల్ జమీన్ కోసం తుదుశీ మోగించి ఎదురు తిరిగి అసు వులు బాసిన ఆదివాసి యోధుడు కొమరం భీమ్ ను ఆదివాసీ లు స్మరించుకుంటూ ప్రతి ఏట అశ్వయుధ శుద్ధ పౌర్ణమి రోజున జోడేగడ్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు జరుపుకుంటారు కుంమ్రం భీం మరణం తర్వాత ఆస్ట్రిలీయా దేశస్థుడైన ప్రముఖ ఆంత్రో పాలజిస్ట్ హైమాన్ డార్ఫ్ నీ నిజాం తన నూతన రహస్య వర్తకుడిగా నియమించుకున్నాడు భీం పోరాటం తర్వాతనే గోండ్ ఆదివాసుల బ్రతుకుల్లో వెలుగులు నిండాయిఅనిన్నారు. కార్యక్రమం లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు కుంజ నరసింగరావు, పూనేం సందీప్ కుమార్,మల్లెల సారయ్య,పొనక ప్రకాష్, వట్టం నిశాంత్, కల్తీ సురేందర్, మల్లెల రమేష్,సిద్దబోయిన భద్రయ్య, సిద్దబోయిన కిషోర్, తాటి సుదర్శన్, మంకిడి ఉపేందర్,ఈక నగేష్,తాటి అనిల్, సిద్దబోయిన సతీష్,ముయ్యబోయిన నరేష్,కల్తీ నరేష్ ఆదివాసీ సేన,వజ్జ సారయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఈసం స్వామి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, సర్పంచ్ లు మల్లెల భాగ్యమ్మ,దనసరి ముత్తయ్య, గొంది రాజు,బంగారి నరేష్ పటేల్ సిద్దబోయిన వీరాస్వామి, ఆదివాసీ ఉద్యోగులు చుంచ సారయ్య,వాసం నర్సయ్య,వట్టం సాయిలు,వాసం కిషేందర్, బంగారి ఆదిలక్ష్మి,అలెం సాంబయ్య తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

శీలం నరసింహారావు అకాల

మరణం పట్ల నేతల తీవ్ర దిగ్భ్రాంతి!

నేలకొండపల్లి సర్పంచ్ భర్త మరణం: నివాళులర్పించిన ప్రముఖ రాజకీయ నాయకులు

కుటుంబాన్ని పరామర్శించిన మాజీ శాసన సభ్యులు కందాళ, సండ్ర, తాతా మధు

ప్రజా వాయిస్ ఖమ్మం:

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి భర్త, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శీలం నరసింహారావు అకాల మరణం పట్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వార్త తెలుసుకున్న వెంటనే... పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీర్రయ్య, నేలకొండపల్లి మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య వారి నివాసానికి వెళ్ళి వారి పార్థివ దేహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేలకొండపల్లిలో వివిధ పార్టీ మండల నాయకులు, గ్రామ నాయకులు, టౌన్ నాయకులు, యూత్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి కాంగ్రెస్ మహిళా నాయకురాలు పసుపులేటి శ్రీలత, పసుపులేటి ఉపేందర్, తోట వాసు, కొమ్మూరి నరేష్, రాంబాబు, ముక్కంటి, జెర్రిపోతుల సత్యనారాయణ, మండలంలోని పలువురు మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తదితరులు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



మిషన్ భగీరథ పైపు లీకేజీ కావడంతో నీరు వృధా

- మిషన్ భగీరథ పైపులు లీకేజీ కావడంతో ప్రజల ఇబ్బందులు
- నీరు వృధా పోతున్న పట్టించుకోని మిషన్ భగీరథ లైన్మెన్ సూపర్వైజర్ల పై చర్యలు తీసుకోవాలి

ప్రజా వాయిస్ తలకొండపల్లి :

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో లింగాకుట్ల సమీపంలో మిషన్ భగీరథ పైపు లీకేజీ కావడంతో న మీరంతా వృధాగా పొలాల్లోకి పోతున్నాయి మిషన్ భగీరథ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు చనిపోవడం లేదని ఒకటి నుంచి రెండు బిందెలు పట్టుకునే లోపే నల్లలు ఆగిపోతున్నాయని గ్రామస్తులు మిషన్ భగీరథ లైన్మెన్ లపై మండిపడుతున్నారు. మిషన్ భగీరథ లైన్మెన్ లా మిషన్ భగీరథ సూపర్వైజర్ల నిర్లక్ష్యం వల్లనే తాగునీటి సమస్య ఉంటున్నాయని తలకొండపల్లి గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు ఎలినో ప్రభావం వలన వర్షాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ప్రతి నీటిని చుక్కలు ఓడిసిపట్టాలని అధికారులకు గైడ్లైన్స్ ఇస్తుంటే మిషన్ భగీరథ ఎంప్లాయిస్ లకు మాత్రం ఎక్కడ లీకేజీలు అక్కడే వదిలేస్తున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు.. మిషన్ భగీరథ నీరు గ్రామంలో కొన్ని కాలనీలోని కనీసం తాగడానికి కూడా నీళ్లు రావడం లేదని వచ్చిన కొన్ని నీళ్లు చెత్తాచెదారం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండిపోతుంటే తాగడానికి నీళ్లు దొరకక కొన్ని గ్రామాలు ఇబ్బందులు పడుతుంటే తలకొండపల్లి మండల కేంద్రంలో లింగాకుట్ల సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ అవుతూ తాగే నీరు మొత్తం కలుషితంగా మారిపోతుందని తాగడానికి కూడా లేని విధంగా ఉంటుందని ప్రజలు తెలిపారు. బిందెలైన పేరు ఎర్ర కలర్ లో వస్తున్నాయా ఈ లీఫ్ కేజీలను అరికడితే బాగుండేది సమస్య లేకుండా ఉంటుందని జీవిత కాలనీవాసులు కాబోతున్నారు. మిషన్ భగీరథ లో పనిచేస్తున్నటువంటి లైన్మెన్ సూపర్వైజర్లపై చర్యలు తీసుకోవాలని తలకొండపల్లి గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు.





ఆపదలో అండగా.. ఆత్మీయతకు చిరునామాగా పాదిల ప్రదీప్ కుమార్

సీనియర్ న్యాయవాది జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ
న్యాయసేవతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందంజ
ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా అండ

ప్రజా వాయిస్,సూర్యాపేట:

ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ.. ఆత్మీయతకు మారుపేరుగా.. న్యాయసేవతో పాటు సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేసుకున్న సీనియర్ న్యాయవాది పొదిల ప్రదీప్ కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం సూర్యాపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అన్నా అని పిలిస్తే.. నేనున్నా అంటూ భరోసా ఇచ్చే వ్యక్తి

అన్నా అని పిలిస్తే నేనున్నా అంటూ ముందుకొచ్చే ప్రదీప్ కుమార్ మంచికి మారుపేరని స్నేహితులు కొనియాడారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ న్యాయం కోసం తన వద్దకు వచ్చే క్లయింట్లను సొంత అన్నలా ఆదుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే గొప్ప మనసున్న వ్యక్తి అని ప్రశంసించారు.న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ, శిక్ష పడే పరిస్థితుల్లో ఉన్నవారిని నిర్దోషులుగా బయటకు తీసుకొచ్చేందుకు తన న్యాయపరిజ్ఞానంతో కృషి చేసిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

సేవే లక్ష్యంగా.. అభివృద్ధే ఆశయంగా

ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ, ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ప్రదీప్ కుమార్ వ్యక్తిత్వం అందరికీ ఆదర్శమని కొనియాడారు.ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ, న్యాయసేవతో పాటు సామాజిక సేవలోనూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

బయ్యారం ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 12 వరకు అవకాశం
బడి మధ్యలో మానేసిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
కోఆర్డినేటర్ ధనుంజయ

ప్రజా వాయిస్, బయ్యారం..

చదువుకోవాలనే ఆసక్తి ఉండి వివిధ కారణాలతో మధ్యలోనే బడి మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ మరో మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. పదో తరగతి (ఓపెన్ టెన్త్), ఇంటర్మీడియట్ (ఓపెన్ ఇంటర్) కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 12వ తేదీ (12-11-2026) వరకు పొడిగించినట్లు బయ్యారం ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఎం. ధనుంజయ తెలిపారు.చదువుకు దూరమైన వారు తమ విద్యాభ్యాసాన్ని తిరిగి కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.



కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర వ్యక్తిగత కారణాలతో చదువును మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వయస్సు, విద్యార్హతలకు అనుగుణంగా అర్హత కలిగిన విద్యార్థులు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.

దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలు

ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డు, చివరిగా చదివిన పాఠశాల నుంచి పొందిన ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), విద్యార్హత మెమో, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలను జతచేసి దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

ఈ నెల 12 చివరి గడువు

ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ కోర్సుల్లో చేరాలనుకునే ఆసక్తిగల విద్యార్థులు ఎలాంటి ఆలస్యం చేయకుండా నవంబర్ 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ కోరారు. గడువు పొడిగింపును విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ విద్యా లక్ష్యాలను నెరవేర్చుకోవాలని అన్నారు.మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:- ఎం. ధనుంజయ, కోఆర్డినేటర్: 9949407795- జి. దస్తగిరి, అసిస్టెంట్ కోఆర్డినేటర్: 9550634184- బి. రమేష్: 8106602041 మరిన్ని వివరాలు, ప్రవేశాల ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం పై నంబర్లను సంప్రదించాలని కోఆర్డినేటర్ ధనుంజయ తెలిపారు...

నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు!

కాంటాలు లేవు.. తరలింపు లేదు.. అకాల వర్షాలతో అన్నదాతకు కష్టాలు
రైతులను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆగ్రహం

ప్రజా వాయిస్, నల్గొండ

నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. రైతులు తమ కష్టార్జిత పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కాంటాలు ప్రారంభం కాలేదని, మరోవైపు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ కూడా మందకొడిగా సాగుతోందని మండిపడ్డారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, సాగుకు అవసరమైన విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వంటి కారణాలతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఎన్నో కష్టాలు, ఆటుపోట్లు ఎదుర్కొని పంట పండించిన రైతులకు చివరకు దాన్ని అమ్ముకోవడమే పెద్ద సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి కాంటాల కోసం ఎదురుచూస్తుండటం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పంట చేతికొచ్చిన సమయంలో రైతులు ఆనందంగా ఉండాల్సింది పోయి ఆందోళనతో రోజులు గడపాల్సిన దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో వరి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కొనుగోలు కేంద్రాల అవసరం, ధాన్యం సేకరణ, రవాణా, మిల్లులకు తరలింపు వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులపై ఉందని నాగం వర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. అయితే ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని, కాంటాలు వేయడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం వంటి కీలక ప్రక్రియలు సకాలంలో జరగడం లేదని అన్నారు. రైతుల నుంచి ఎంత ధాన్యం వస్తుంది? దాన్ని ఎలా సేకరించాలి? ఎక్కడ నిల్వ చేయాలి? ఎంత వేగంగా మిల్లులకు తరలించాలి? అనే విషయాల్లో అధికారులకు స్పష్టత లేకపోవడం ప్రభుత్వ ముందుచూపు లేమికి నిదర్శనమని విమర్శించారు.నల్గొండ జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాపంగా మారారని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి



ఘాటుగా వ్యాఖ్యానించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వ బాధ్యత కాదని, రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి తక్షణమే కాంటాలు వేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసి, ఎలాంటి జాప్యం లేకుండా మిల్లులకు తరలించే బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు, తరలింపు విషయంలో మంత్రి ప్రత్యేక చొరవ చూపకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంపై జిల్లా ప్రజాప్రతినిధులు తక్షణమే దృష్టి సారించాలని కోరారు.ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకుంటూ కాంటాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు అకాల వర్షాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. నిన్న, నేడు కురుస్తున్న వర్షాలు, ముసురు కారణంగా ఆరబెట్టిన ధాన్యం మళ్లీ తడిసిపోతోందని పేర్కొన్నారు. రైతులు ఎంతో శ్రమించి పండించిన పంట వర్షానికి తడిసి నాణ్యత తగ్గితే వారికి మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రక్షించేందుకు అవసరమైన టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు ఆ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. రోజుల తరబడి కేంద్రాల వద్దే ఉంటున్న రైతులకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమన్నారు. వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందిస్తూ, ధాన్యం సేకరణకు అవసరమైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కాంటాలు, ధాన్యం తరలింపు విషయంలో పూర్తిగా విఫలమవుతోందని నాగం వర్షిత్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతు రైతులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.రైతుల నుంచి ధాన్యం సేకరించి వారికి సకాలంలో చెల్లింపులు జరపడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్రం రైతులకు అండగా నిలుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమస్యను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ఎదురుచూస్తున్న రైతుల ధాన్యానికి వెంటనే కాంటాలు వేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా మిల్లులకు తరలించాలని కోరారు.అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడేందుకు టార్పాలిన్లు, ఇతర రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల పర్యవేక్షణ పెంచాలని అన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాగం వర్షిత్ రెడ్డి విమర్శించారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు రైతుల సమస్యల పరిష్కారంపై చూపాల్సిన శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు..రైతుల కష్టాన్ని రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా, వారి పంటను సకాలంలో కొనుగోలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోళ్లు, కాంటాలు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతులను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతుందని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, బీజేపీ నాయకులు వంగూరి రాఖీ, పాలకూరి రవిగౌడ్, మంగలిపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య నీడలో చారిత్రక 'గడి'.. పట్టించుకోని పురాతత్వ శాఖ!

ప్రజా వాయిస్,పాపన్నపేట



పాపన్నపేట మండల కేంద్రంలో శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన గడికోట (గడి) నేడు సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేక రూపురేఖలు కోల్పోతోంది. ఒకప్పుడు రాజులు, జమీందార్ల పాలనాధికారానికి, సంస్థానాల ప్రాభవానికి ప్రతీకగా నిలిచిన ఈ కోట, ప్రస్తుతం ఆక్రమణలు, పిచ్చిమొక్కల ముళ్లకంపల నడుమ శిథిలావస్థకు చేరుతోంది.

కాలగర్భంలో కలుస్తున్న చరిత్ర

మండలంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ చారిత్రక నిర్మాణం ఎంతో మంది పర్యాటకులను, చరిత్రకారులను ఆకట్టుకునేది. అయితే రానురానూ రక్షణ కరువై, గోడలు విరిగిపడటంతో పాటు వర్షాలకు ప్రాకారాలు దెబ్బతింటున్నాయి. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఇలాంటి కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

నిధుల కేటాయింపు - పురాతత్వ శాఖ స్పందన ఏది?

గడికోట పునరుద్ధరణ మరియు సంరక్షణ కోసం గతంలో ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, ఆచరణలో నిధుల విడుదల మందకొడిగా సాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పురాతత్వ, మ్యూజియంల శాఖ అధికారులు తక్షణమే ఈ కోటను సందర్శించి, పరిశీలించాలని కోరుతున్నారు. కోట చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పురాతత్వ శాఖ అధికారుల దృష్టికి..

"పాపన్నపేట మండలంలోని ఈ చారిత్రక గడికోటను రక్షిత కట్టడంగా గుర్తించి, సంరక్షణ చర్యలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. సరిహద్దు గోడల నిర్మాణం, ప్రాచీన శైలి దెబ్బతినకుండా మరమ్మతులు చేయడం ద్వారా భావితరాలకు మన మండల చరిత్రను అందించవచ్చు అని గ్రామస్తులు కోరుతున్నారు.



బజార్హత్నూర్ లో కొమరం భీం విగ్రహావిష్కరణ

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి జి నగేష్

అదిలాబాద్ జిల్లా, బజార్హత్నూర్, ప్రజా వాయిస్

ఈరోజు బజార్హత్నూర్ మండల కేంద్రంలో గిరిజనుల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ నినాదంతో గిరిజనుల్లో చైతన్యం తెచ్చిన కొమరం భీమ్ నూతన విగ్రహాన్ని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి నగేష్ ఆవిష్కరించారు. గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో ఆటపాటలతో ఆడుతూ పాడుతూ ఎంపీ ని ఆహ్వానం పలికి విగ్రహావిష్కరణ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ కుమరం భీం స్ఫూర్తితో అందరూ కలసి కట్టుగా ముందుకు వెళదామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, మాజీ రైల్వే బోర్డు మెంబర్ గుండ్ల వెంకట రమణ, ఇచ్చోడ సర్పంచ్ జలై జాకు, నాయకులు అల్కా గణేష్, పాక్స్ చైర్మెన్ వెంకన్న, మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్, నానం రమణ తో పాటు మండల ఆదివాసి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోతె మండలానికి ఎమ్మెల్యే రాక

మూడు గ్రామాల్లో పరామర్శలు..

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్న ఎమ్మెల్యే



ప్రజా వాయిస్, మోతె, నవంబర్ 01:-

కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సోమవారం మోతె మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు రాయికుంట తండాలో భూక్య బిచ్య కుటుంబాన్ని పరామర్శిస్తారు. 11:30 గంటలకు రాందాస్ తండాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూక్య దస్రు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు రాంపురం తండాలో అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొర్ర రాములు నాయక్‌ను పరామర్శిస్తారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి కోరారు.



అమిత్ షా పాదయాత్రకు బీజేపీ శ్రేణుల భారీ సంఖ్యలో తరలి వెళ్లాలి

రాజ్యాంగ సంస్థల పరిరక్షణే లక్ష్యం: బీజేపీ మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్,

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 1 :

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో నవంబర్ 2న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎం.జె. మార్కెట్ వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రకు చిలుకూరు మండలం నుంచి యువతీ యువకులు, బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలపై అనవసర ఆరోపణలు చేస్తూ వాటి ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించడం, దర్యాప్తు సంస్థలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజ్యాంగ సంస్థల పరిరక్షణకు, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహిస్తున్న పాదయాత్రకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు కొండ శ్రీనివాస్, రామినేని నరసింహ వర్మ, ఉపాధ్యక్షుడు తిప్పిరిశెట్టి బసవయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిని శ్రీను, మోదుగు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, నాగచారి, దుస్సా వెంకటరాజు, బుడిగ వీరబాబు, కట్టెకొల్ల ఎంకన్న తదితరులు పాల్గొన్నారు.



పులిమామిడి స్టేజి వద్ద రోడ్డు ప్రమాదం

వడ్ల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. తృటిలో తప్పిన పెను ప్రమాదం..

రోడ్డుపై అడ్డంగా పడిన ట్రాక్టర్.. చెల్లాచెదురుగా వడ్లు..

ప్రజా వాయిస్ : హాలియా :నవంబర్ 1

అనుముల మండలం పులిమామిడి స్టేజికి సమీపంలో వరి ధాన్యంతో వెళ్తున్న ట్రాక్టర్ను లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ నడిరోడ్డు పైన బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్లో ఉన్న వరి ధాన్యం నడిరోడ్డు పైన పడటంతో ప్రధాన రహదారిపై వచ్చిపోయే వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా మారింది. దీంతో అతి ఎక్కువ సమయం వాహనదారులకు అంతరాయం జరగడంతో కొంతమంది రైతులు ఆ దారిన వెళ్తున్న వాహనాలను దగ్గరుండి ట్రాఫిక్ ను క్లియర్ చేయడం జరిగింది. అలాగే వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లుకు అతి సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడడంతో వరి ధాన్యం పంట పండించిన రైతు ఆరుకాలం కష్టం చేసి పంట పండించి, చివరికి అమ్మే పరిస్థితిలో వెళుతుండగా నష్టం జరగడంతో ఏడుస్తున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో రైతుకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా వాహనదారులు అతి వేగాన్ని తగ్గించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కేంద్ర బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి..

- డిసెంబర్ 1,2,3 తేదీలలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- భూపాల్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు





ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 01):

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్లో రెండు రోజులుగా జరుగుతున్న సిఐటియు జిల్లాస్థాయి నాయకత్వ శిక్షణ తరగతుల్లో లేబర్ కోడులు – కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా మార్చే 4 లేబర్ కోర్సును కోడులను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవర్ణ బిల్లును ఉపసంహరించాలని, కనీస వేతనం నెలకు 42,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం, డిమాండ్ల పరిష్కారం కోసం వచ్చే నెల డిసెంబర్ 1,2,3 తేదీలలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లాలోని కార్మిక ఉద్యోగ వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.భారతదేశ కార్మిక వర్గం అనేక ఆందోళనా పోరాటాల ద్వారా 29 కార్మిక చట్టాలను సాధించుకున్న వాటి వల్ల కార్మిక వర్గానికి అందుతున్న కొద్దిపాటి ప్రయోజనాలకు కూడా దూరం చేయడానికి, కార్పొరేట్లకు ప్రయోజనం కల్గించేందుకు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరున కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 2019, 2020 సంవత్సరాలలో 4 లేబర్ కోడ్ లను 1. వేతనాల కోడ్, 2019 (4 చట్టాలను కలుపుకొని), 2. పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020 (3 చట్టాలను విలీనం), 3. సామాజిక భద్రత కోడ్, 2020 (9 చట్టాలను విలీనం), 4. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020 (13 చట్టాలను విలీనం) తీసుకొచ్చిందని వివరించారు.లేబర్ కోడ్స్ ను రద్దుచేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని భారత కార్మిక వర్గం గడిచిన 6 సం.లలో అనేక ఆందోళనా పోరాటాలు చేసిందన్నారు. అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు 2026 ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెలో సమ్మెలో సుమారు 30 కోట్ల మంది పాల్గొని తీవ్రనిరసన తెలియజేశారని, కార్మికవర్గ ఆందోళనను, నిరసనల వల్ల గడిచిన 6 స.కాలం కోడ్ లను అమలులోకి తేలేకపోయిందన్నారు. ట్రేడ్ యూనియన్ యాక్ట్ 1926, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్ 1947, ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యాక్ట్ కలిపి ది ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ ను తెచ్చింది. సంఘం పెట్టుకునే హక్కు మీద దాడి చేస్తున్నారన్నారు.. 1926లో బ్రిటీష్ కాలంలోనేసాధించుకున్న కార్మిక హక్కులను 99 సంవత్సరాల తర్వాత నేడు మోడీ ప్రభుత్వం హరించడం అన్యాయమని, కనీస వేతనాల చట్టం 1948, వేతనాలు చెల్లింపు చట్టం 1936, బోనస్ చెల్లింపులు చట్టం 1965, సమాన వేతనం చట్టం 1976లు రద్దు చేసి వేజ్కోడ్ తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల 16వ ఐఎల్సి తీర్మానం, సుప్రీం కోర్టు తీర్పులకు భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యిష్టారాజ్యంగా కనీస వేతనం నిర్ణయించే అవకాశం కల్పించిందని, ఫ్లోర్ లెవెల్ మినిమమ్ వేజ్ ను కేంద్రం రోజుకు రూ.171/-లుగా నిర్ణయించిందని, రూ. 15,000లకు మించి వేతనం దాటితే 'కార్మికుల' నిర్వచనం వర్తించదనన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో 4 లేబర్ కోడ్ల ద్వారా విదేశీ, స్వదేశీ బహుళ జాతి సంస్థలకు గరిష్ట లాభాలు కట్టబెట్టేందుకు, కార్మిక హక్కులను హరిస్తున్న నేపథ్యంలో 4 లేబర్ కోడుల రద్దుకై దేశ కార్మిక వర్గం దీర్ఘకాలిక సమ్మె పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో జి.రాజేశం, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు శ్రీనివాస్, గీట్ల ముకుంద రెడ్డి ఉపాధ్యక్షులు, ఎడ్ల రమేష్, జె రాజమల్లు, యం శ్రీలత, సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలి..

వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

ఇంట్లో బంగారం, నగదు ఉంచకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలి

ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అత్యవసర సహాయం కోసం 112కు కాల్ చేయాలి

వేములపల్లి ఎస్ఐ సురేష్ రెడ్డి



ప్రజా వాయిస్,వేములపల్లి.

ఇటీవల దొంగతనాల ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ ఇళ్లకు, విలువైన వస్తువులకు తగిన భద్రత కల్పించుకోవాలని వేములపల్లి ఎస్ఐ సురేష్ రెడ్డి సూచించారు. పక్క మండలాలు, పరిసర ప్రాంతాల్లో దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లు సమాచారం ఉన్నందున గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ఈ సందర్భంగా పలు భద్రతా సూచనలు చేశారు. రాత్రి వేళల్లో ఇంటి తలుపులు, కిటికీలను తప్పనిసరిగా లాక్ చేసుకోవాలని, ఇంట్లో ఎక్కువ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పొరుగువారికి లేదా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, వీలైనంత వరకు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల కోసం ఊరు విడిచి వెళ్లేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద కదలికలు గమనించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే 112 నంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యతని, ప్రజల రక్షణ కోసం పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ఎస్ఐ సురేష్ రెడ్డి స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం!

ఉపేక్షించేది లేదు అక్రమ రవాణా పై కఠిన చర్యలు

పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ శ్రవణ్ కుమార్

హెరాయిన్ కేసులో పరారీలో ఉన్న NDPS నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్

రాష్ట్రం దాటి వెళ్లి పట్టుకున్న ప్రత్యేక బృందానికి ఉన్నతాధికారుల అభినందనలు



పటాన్ చెరువు ప్రజా వాయిస్

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని పటాన్‌చెరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. శ్రవణ్ కుమార్ హెచ్చరించారు. హెరాయిన్ కేసులో పరారీలో ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిందితుడిని పటాన్‌చెరు ఎక్సైజ్ ప్రత్యేక బృందం రాష్ట్రం దాటి వెళ్లి అరెస్టు చేయడం కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే.. పటాన్‌చెరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆగస్టు 11న హెరాయిన్ (బ్రౌన్ షుగర్)కు సంబంధించి చీఐూూ కేసు నమోదైంది. ఈ కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిందితుడు అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు అక్టోబర్ 25న ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పశ్చిమ బెంగాల్‌కు పంపించారు. అక్కడి మాల్దా ప్రాంతంలో స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం ట్రాన్సిట్ రిమాండ్‌పై స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచి, నవంబర్ 1న పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం సంగారెడ్డి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వై. రాధాకృష్ణ రెడ్డి, పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ ఆర్. శ్రవణ్ కుమార్ పర్యవేక్షణలో ఏఈఎస్ సాయిరాం, ఎస్ఐ ఫయాజ్, కానిస్టేబుళ్లు నెహ్రూ, రవికిరణ్, సంజయ్‌లతో కూడిన ప్రత్యేక బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది.రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లి నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన ప్రత్యేక బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తామని, చీఐూూ కేసుల్లో పరారీలో ఉన్న వారిని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఐ శ్రవణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆపరేషన్‌కు సహకరించిన పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఎక్సైజ్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది.

కుల వివక్షను అధిగమించి ఒక్కటైన ప్రేమజంట..!

పోలీసుల సమక్షంలో దివ్య, అరవింద్‌ల వివాహం..

ఎస్సై సృజన్ కుమార్ చొరవతో సమస్యకు పరిష్కారం



ప్రజా వాయిస్ /పాలకుర్తి/నవంబర్ 01

కుల వివక్ష, కుటుంబ అభ్యంతరాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న ప్రేమ వ్యవహారం ఎట్టకేలకు సుఖాంతమైంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామానికి చెందిన గిద్దెల దివ్య, గన్న అరవింద్‌లు పెద్దల సమక్షంలో ఒక్కటయ్యారు. పాలకుర్తి పోలీసుల చొరవతో ఇరు కుటుంబాల మధ్య సయోధ్య కుదరడంతో వీరి వివాహం జరిగింది.శాతపురం గ్రామానికి చెందిన దివ్య, అరవింద్‌లు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో దివ్య నాలుగు నెలల గర్భవతి కావడంతో ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే కులాంతర వివాహం కావడంతో అరవింద్ కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దివ్య దళితురాలు కావడంతో వివాహానికి నిరాకరించినట్లు ఆరోపణలు వచ్చాయి.

న్యాయం కోసం దివ్య ఆవేదన.

తనను వివాహం చేసుకోవాలని కోరుతూ దివ్య అరవింద్ ఇంటి వద్దకు వెళ్లడంతో విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలుసుకున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు దివ్యకు మద్దతుగా నిలిచి సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కుల వివక్షకు తావులేకుండా న్యాయం చేయాలని నాయకులు కోరారు.



ఎస్సై చొరవతో ఇరు కుటుంబాల మధ్య సయోధ్య.

విషయంపై స్పందించిన పాలకుర్తి ఎస్సై ఊర సృజన్ కుమార్ ఇరు కుటుంబాల సభ్యులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇరువురి అభిప్రాయాలు తెలుసుకుని, పరస్పర అంగీకారం మరియు చట్టపరమైన అంశాలను వివరించారు. దీంతో కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య కుదిరి వివాహానికి అంగీకారం లభించింది.

పోలీసుల సమక్షంలో ఒక్కటైన జంట

ఎట్టకేలకు పోలీసుల సమక్షంలో, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో దివ్య, అరవింద్‌లు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ సమస్య పరిష్కారంలో చొరవ చూపిన ఎస్సై సృజన్ కుమార్‌ను, దివ్యకు అండగా నిలిచిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎడవెల్లి సోమ చందర్, సీపీఐ (ఎంఎల్) నాయకులు గుమ్మడి రాజు సాంబయ్య, రజితతో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులను పలువురు అభినందించారు.

ఢిల్లీ ధర్నాలో నేలకొండపల్లి కాంగ్రెస్ శ్రేణుల జోరు!

ఓట్ బచావో - దేశ్ బచావో: రామ్‌లీలా మైదానంలో హోరెత్తిన కాంగ్రెస్ నిరసన

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీలో గర్జించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు

ధర్నాలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ



ప్రజా వాయిస్ ఖమ్మం:

దేశ రాజధానిలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానం వేదికగా 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఓట్ల చోరీ వ్యతిరేక ధర్నా కార్యక్రమం రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా సాగిన ఈ మహా నిరసన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు ఉత్సాహంగా పాల్గొని జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.ఓట్ బచావో.. దేశ్ బచావో నినాదంతో హోరెత్తిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్రనేతలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ప్రముఖులు, దేశవ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నేలకొండపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ సహా మండలం నుండి పలువురు కార్యకర్తలు పాల్గొని ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ... దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును అపహాస్యం చేసేలా జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకే తాము ఢిల్లీ గడ్డపై నిరసన గళం విప్పినట్లు స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలం నుంచి జాతీయ స్థాయి ఉద్యమానికి సంఘీభావం తెలపడం ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాపాడుకునే వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించదని, భవిష్యత్తులోనూ ప్రజాక్షేమం కోసం ఇలాంటి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన తేల్చిచెప్పారు.ఢిల్లీ వేదికగా జరిగిన ఈ జాతీయ స్థాయి నిరసన కార్యక్రమంలో నేలకొండపల్లి మండలం తరఫున కొడాలి గోవిందరావు పాల్గొనడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ సమరశంఖం
ఢిల్లీ నిరసన సభకు కదిలిన జైపూర్ మండల నాయకులు

మంత్రి వివేక్ పిలుపుతో ఢిల్లీకి జైపూర్ దళం - ఓటు హక్కు కోసం కాంగ్రెస్ పోరు



జైపూర్ ప్రజా వాయిస్ :

దేశంలో ప్రజాస్వామ్య విలువల కాపాడుకోవడంతో పాటు ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటం తీవ్రరూపం దాల్చింది. ఈ ఉద్యమంలో భాగంగా ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓటు బచావో.. దేశ్ బచావో' పేరిట భారీ బహిరంగ నిరసన సభను నిర్వహించారు. ఈ సభకు జైపూర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావం తెలిపారు.కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక వెంకటస్వామి ఆదేశాల మేరకు, జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా విశ్వంభర్ రెడ్డి నాయకత్వంలో మండల నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు.

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తూ ఓట్ల చోరీకి పాల్పడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న అక్రమాలు, ప్రజాస్వామ్య హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత మూడు నెలలుగా దేశవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన సాధనమని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చిన ఈ సభలో, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పునరుద్ధరించాలని, ఓటర్ల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పలువురు అగ్రనాయకులు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఈ నిరసన సభలో జైపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా విశ్వంభర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గోనే నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శులు, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, వేముల రవీందర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఉస్కమల్ల రవి, సర్పంచ్ తాళ్లపెల్లి అంజన్ గౌడ్, సీనియర్ నాయకులు మున్నాభాయ్, లక్కెపురం భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

- **60 శాతానికి పైగా పంట నష్టం.. రైతులను ఆదుకోవాలి**
- **కరువు మండలాల జాబితాలో గజ్వేల్‌కు చోటు కల్పించకపోవడంపై అభ్యంతరం**
- **వరి పంటకు నీరు అందక సగానికి పైగా ఎండిపోయిన పరిస్థితి**
- **పత్తి రైతులకు పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి**
- **బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్**



ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

గజ్వేల్ మండలంలోని పలు గ్రామాల్లో 60 శాతానికి పైగా పంటలు నష్టపోయిన పరిస్థితి నెలకొందని, గజ్వేల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో గజ్వేల్‌కు చోటు కల్పించకపోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంజాల అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. అసలు ఏ ప్రాతిపదికన కరువు మండలాలను ఎంపిక చేసి ప్రకటించారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. గజ్వేల్ మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పరిశీలిస్తే 60 శాతానికి పైగా పంటలు నష్టపోయిన పరిస్థితి కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా వరి పంటకు సరిపడా నీరు అందక సగానికి పైగా పంట ఎండిపోయిందని తెలిపారు. మండలంలో ప్రధానంగా సాగు చేసే వరి, పత్తి పంటలకు సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పత్తి రైతులకు కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కరువు మండలాల ఎంపికలో గజ్వేల్ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతోపాటు పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన సహాయాన్ని అందించి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, దాతరపల్లి సర్పంచ్ దివ్యరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మన్నె శేఖర్, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, మండల నాయకులు నరేష్‌గౌడ్, మహేందర్, నవీన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిలో దుబ్బాకకు తీవ్ర అన్యాయం...

నిధులిచ్చి నిలబెడతాం: ఎంపీ రఘునందన్ రావు

ప్రజా వాయిస్ దుబ్బాక

గతంలో పాలించిన వారు కానీ, ప్రస్తుతం గెలిచిన వారు కానీ దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి పైసా నిధులు తీసుకురాలేకపోయారని, నాటి నుండి నేటి వరకు దుబ్బాక అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. పార్టీలు వేరైనా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఎంపీ నిధుల నుంచి కేటాయించిన రూ. 30 లక్షల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. దుంపలపల్లి వార్డులో రజక సంఘం, వైశ్య సంఘం భవన నిర్మాణాలకు, 15వ వార్డులో స్వర్ణకారుల సంఘ భవనానికి, అలాగే 16వ వార్డులోని హనుమాన్ దేవాలయ కళ్యాణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెదక్ జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే దుబ్బాక ప్రాంతం రాజకీయంగా, అధికారికంగా తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికైనా విషయాన్ని గమనించి మార్పు వైపు ఆలోచించాలని కోరారు. ఎంపీగా నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల మరియు పట్టణ స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



పెద్దదేవలపల్లిలో వైభవంగా లింగమంతుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి

ప్రజా వాయిస్,నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ నియోజకవర్గం, త్రిపురారం మండలం పెద్దదేవలపల్లి గ్రామంలో శ్రీ లింగమంతుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు ఎం.సి. కోటిరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులతో ముచ్చటించి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు కడారి అంజయ్య యాదవ్, కట్టెబోయిన గురువయ్య యాదవ్, స్థానిక సర్పంచ్ వెంకన్న యాదవ్, మాజీ ఏజీపీ, ప్రస్తుత నిడమనూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెద్దబోయిన శ్రీనివాస్ యాదవ్, పెద్దగొల్ల గుండెబోయిన కోటేష్ యాదవ్, తెలంగాణ ఉద్యమ నాయకులు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, రావుల శ్రీనివాస్ యాదవ్, బహునూతల నరేందర్, కోటేష్ యాదవ్, నాగేష్ యాదవ్, యువ నాయకులు జానపాటి సతీష్ యాదవ్, గ్రామ యాదవుల బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద బాధిత సర్పంచ్‌కు పరామర్శ..

మొక్క నాగమ్మ దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి

ప్రజా వాయిస్ మోతె నవంబర్ 01:-

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోతె మండలం ఉర్లుగొండ గ్రామ సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లును మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పరామర్శించారు. అనంతరం స్వర్గీయ మొక్క నాగమ్మ దశదిన కర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు భూక్య బిక్కు, దారమళ్ళ గోవర్ధన్, భూక్య మల్సూర్, హలవత్ స్వామి, లింగయ్య, బర్మావత్ మల్సూర్, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎండిన పంటలు.. నేలకొరిగిన వరి.. అన్నదాతకు అపార నష్టం

పంట నష్టాలను పరిశీలించిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డా వెంకటయ్య

ప్రజా వాయిస్,చిలుకూరు, నవంబర్ 1 :

మండల కేంద్రంలో ఎండిపోయిన కంది, పెసర పంటలతో పాటు గాలి, వానకు నేలకొరిగిన వరి పంటలను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దొడ్డా వెంకటయ్య రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం దొడ్డా వెంకటయ్య మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఎండిపోయిన పంటలకు, దెబ్బతిన్న వరి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చిలుకూరు వ్యవసాయ శాఖ అధికారి సల్మాబేగం, రైతు అలసగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి: చెరుకు శ్రీనివాస్ రెడ్డి

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ...

పెద్ద సంఖ్యలో హాజరైన దుబ్బాక నియోజకవర్గ శ్రేణులు

ప్రజా వాయిస్, దుబ్బాక:

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని మరియు ఓటు చోరీ ఆరోపణలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి తమ నిరసనను తెలిపారు.ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం మరియు పౌరుల ఓటు హక్కుకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ నిరసన సభలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రసాదించిన అత్యంత విలువైన ఓటు హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందని, ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల్లో మళ్లీ నమ్మకాన్ని కలిగించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య బద్ధంగా తమ పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రకటించాయి.



సేవా గుణంలో సాటిలేని
వ్యక్తి.. ప్రదీప్ కుమార్

సీనియర్ న్యాయవాది జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

న్యాయసేవతో పాటు సామాజిక సేవలోనూ ప్రత్యేక గుర్తింపు

ప్రజా వాయిస్, మోతే:

ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ.. న్యాయసేవతో పాటు సామాజిక సేవలోనూ తనదైన గుర్తింపు పొందిన సీనియర్ న్యాయవాది పొదిల ప్రదీప్ కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం మోతె మండలంలోని రాఘవపురం ఎక్స్‌రోడ్డుతో పాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, స్నేహితులు కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.అన్నా అని పిలిస్తే నేనున్నానంటూ భరోసా ఇచ్చే ప్రదీప్ కుమార్ ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్నేహితులు కొనియాడారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సైతం తనవంతు సహాయం అందిస్తూ, గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ న్యాయ, సామాజిక సేవలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మద్ది మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మూడు కృష్ణ, శ్రీలక్ష్మి ప్రసన్న ఎలక్ట్రికల్ బొర్రాజు మల్లయ్య, సామ ప్రభాకర్ రెడ్డి, బత్తిని కనకయ్య, మండవ రాము, గుండాల సైదులు, పజ్జురి ప్రవీణ్, బత్తిని శ్రీకాంత్, బత్తిని క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో మహా అన్నదానం

భక్తిశ్రద్ధలతో పూజలు..పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు,

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 01:

నారాయణపురం, పాలెఅన్నవరం గ్రామాల్లో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెదనాగు బండ వద్ద అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కోలూరు మహాలక్ష్మి గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ప్రసాదంగా అన్నదానాన్ని స్వీకరించారు.గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అయ్యప్ప స్వాములు, గ్రామ ప్రజలు సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తి, సేవాభావంతో నిర్వహించిన ఈ మహా అన్నదాన కార్యక్రమం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

ప్రజా వాయిస్ కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



ఢిల్లీ రామ్‌లీలా మైదాన ర్యాలీకి పాదయాత్రగా తరలిన ఆదిలాబాద్ కాంగ్రెస్ శ్రేణులు

తెలంగాణ భవన్ నుండి మైదానం వరకు ఉత్సాహంగా సాగిన ఆదిలాబాద్ నాయకుల ర్యాలీ

డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ నాయకత్వంలో పాల్గొన్న మాజీ అధ్యక్షులు సాజీద్ ఖాన్

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో హాజరైన శ్రేణులు

ప్రజా వాయిస్, /ఆదిలాబాద్

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నుండి రామ్‌లీలా మైదానం వరకు పార్టీ జెండాలు చేతబూని ఉత్సాహభరిత వాతావరణంలో పాదయాత్రగా బయలుదేరి తమ సమిష్టి ఐక్యతను చాటారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు.ఈ పాదయాత్రలో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజీద్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిలతో పాటు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తుతూ, పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుండి వచ్చిన శ్రేణుల క్రమశిక్షణ, ఉత్సాహం ఢిల్లీ వేదికగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అన్న లేడనే బాధతో తమ్ముడి దారుణ నిర్ణయం..

దుబ్బాక శివారులో చెట్టుకు ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

ప్రమాదంలో అన్న మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఎండి ఫారుక్..

కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజా వాయిస్ దుబ్బాక



అన్న మరణాన్ని తట్టుకోలేకపోయిన ఒక తమ్ముడు అతడి జ్ఞాపకాలతో తీవ్ర మనోవేదనకు గురై ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడిన హృదయవిదారక ఘటన దుబ్బాక పట్టణ శివారులో చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం, పెద్ద చీకోడు గ్రామానికి చెందిన హలీమాబి అనే వృద్ధురాలు కూలి పని చేస్తూ తన కుటుంబంతో జీవనం సాగిస్తోంది. ఆమె రెండవ కుమారుడు ఎండి రఫీ గత నెల 14వ తేదీన జరిగిన ఒక రహదారి ప్రమాదంలో మృతి చెందాడు.అప్పటి నుంచి ఆమె మూడవ కుమారుడు, మతిస్థిమితం సరిగా లేని ఎండి ఫారుక్ (28) తీవ్రంగా బాధపడుతూ ఉండేవాడు. అన్నపై ఉన్న అపరిమితమైన ప్రేమతో తాను కూడా అన్న వద్దకే వెళ్తానంటూ తరచూ రోదిస్తుండేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన ఫారుక్, దుబ్బాక పట్టణ శివారుకు చేరుకున్నాడు. అక్కడ తన వాహనాన్ని ఒక చెట్టు వద్ద నిలిపి, అదే చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాకలోని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి హలీమాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై ధాన్యం కుప్పను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు:కరీంనగర్‌కు తరలింపు

ప్రజా వాయిస్ అక్కన్నపేట

అక్కన్నపేట మండలం సేవాలాల్ మహారాజ్ తండాకు చెందిన 16 సంవత్సరాల భూక్య విజయ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సేవాలాల్ మహారాజ్ తండా నుండి రామవరం వెళ్తుండగా, మార్గమధ్యలో రహదారిపై ఆరబోసిన వడ్ల కుప్పను బైక్ బలంగా ఢీకొట్టి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో విజయ్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అత్యవసరంగా కరీంనగర్ తరలించాలని డ్యూటీ డాక్టర్ సూచించారు.





బిజెపి పార్టీ నూతన మండల కమిటీ ఏర్పాటు

బిజెపి నూతన తలకొండపల్లి మండల కమిటీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన బిజెపి అధ్యక్షుడు నీలకంఠ పాండు.

ప్రజా వాయిస్ తలకొండపల్లి :

జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు ఆచారాన్న సూచన మేరకు భారతీయ జనతా పార్టీ తలకొండపల్లి మండల నూతన కమిటీగా నియమితులైనా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు సభ్యులందరికీ బీజేపీ తలకొండపల్లి మండల శాఖ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు.యువతలో జాతీయ భావాలను పెంపొందిస్తూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ అలాగే కల్వకుర్తి నియోజక వర్గంలో ఆచారన్న ఎమ్మెల్యే గెలుపు కొరకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాము.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, రాబోయే రోజుల్లో పార్టీకి మరింత బలాన్ని చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరుకుంటున్నాము.యువశక్తి దేశశక్తి పార్టీ బలోపేతం బీజేపీ విజయానికి పునాది నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు.



అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ

రూ. 3 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భూషణరావుపేటలో ఘనంగా కొబ్బరికాయ కొట్టిన నాయకులు

ప్రభుత్వ విప్‌కు మాల సంఘం ప్రత్యేక ధన్యవాదాలు

ప్రజా వాయిస్, కథలాపూర్:

మండలంలోని భూషణరావుపేట గ్రామంలో అంబేద్కర్ యువజన మాల సంఘ భవన నిర్మాణ నిమిత్తం ఆదివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్దం మహేందర్, సింగిల్ విండో చైర్మన్ గడ్డం స్వామిరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ వాకిటి రాజారెడ్డి, ఫ్యాక్స్ డైరెక్టర్ కూన అశోక్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తలారి మోహన్, సీనియర్ పాత్రికేయుడు బుర్రి గణేష్, వార్డు సభ్యురాలు అంబటి సంగీత పాల్గొని పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూన సులోచన శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ. 3 లక్షలు మంజూరు చేసినందుకు గ్రామ కాంగ్రెస్ పార్టీ, అంబేద్కర్ యువజన మాల సంఘం అధ్యక్షులు కారంగుల శ్రీనివాస్, పులి మారుతి మరియు సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

శాతవాహన విశ్వ విద్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న లా విద్యార్థిని...



ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 01):

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎల్ ఎల్ బి ద్వితీయ సంవత్సరం చదువుతున్న డక్కాలి చంద్రకళ (28) ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి షాద్ నగర్ కి చెందిన చంద్రకళ మధ్యాహ్నం తోటి విద్యార్థులు భోజనం చేయడానికి రమ్మంటు తలుపు కొట్టిన తీయకపోవడంతో సెక్యూరిటి కి తెలుపగా తలుపులు పగలగొట్టి చూడా అప్పటికే గదిలోని ఉరివేసుకొని ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె మెడలో ఇయర్ ఫోన్స్ ఉండటంతో కాల్ మాట్లడుతూ ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కొత్తపల్లి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్నీ పోస్టుమార్టం నిమిత్తము జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు దర్యాప్తు అనంతరం తెలియనుంది.



డి.చంద్రకళ (28) ఫైల్ ఫోటో





సమతా సందేశంతో పరుగులు...ఉత్సాహంగా 'ఈక్వాలిటీ రన్'

జెండా ఊపి ప్రారంభించిన చిన్న జీయర్ స్వామిజీ, ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి

స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో 350 మందికి పైగా రన్నర్ల భాగస్వామ్యం

ప్రజావాయిస్॥ రాజేంద్రనగర్:

సమానత్వం, సోదరభావం,ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ముచ్చింతల్‌లోని స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో ఆదివారం 'ఈక్వాలిటీ రన్' ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి త్రిదండి చిన్న జీయర్ స్వామిజీ,ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఐపీఎస్,ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి పరుగును ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామిజీ మాట్లాడుతూ.. భగవద్రామానుజుల సమతా సిద్ధాంతం స్ఫూర్తితో సమాజంలో సమానత్వ భావన, సోదరభావం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ..ప్రజల్లో ఫిట్‌నెస్,ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను ప్రోత్సహించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ రన్‌లో 5కే, 10కే,21కే విభాగాల్లో యువత,మహిళలు,పోలీస్ సిబ్బంది సహా 350 మందికి పైగా రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.సమానత్వం అనే గొప్ప సందేశాన్ని పరుగుల రూపంలో చాటుతూ సాగిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రన్నర్లు,నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు, పోలీస్ అధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆకాంక్ష విద్యార్థుల ఎంపిక

ప్రజా వాయిస్ : హాలియా :నవంబర్



1 :

అక్టోబర్ 28న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్ 19 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు పి అశ్వద్, వి.దినేష్ లు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోదాల రవీందర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 31, నవంబర్ 1,2,3 వ తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎండి కరీం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆవుల చంద్రశేఖర్ యాదవ్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.



కానరాని సంచార పశు వైద్య వాహనాలు? ఆందోళనలో పాపన్నపేట రైతాంగం?

ప్రజా వాయిస్,పాపన్నపేట,

పాపన్నపేట మండలంలో సంచార పశు వైద్య వాహనాలు (1962 అంబులెన్సులు) సరిగ్గా అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు, పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర సమయంలో పశువులకు సరైన వైద్యం అందక పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర సమయంలో 1962 ఉచిత కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా, క్షేత్రస్థాయిలో వాహనాలు సమయానికి అందుబాటులోకి రాకపోవడంతో రైతులకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. అస్వస్థతకు గురైన పశువులను, గొర్రెలను, మేకలను దవాఖానలకు తరలించలేక, దూరం భారమై అనేక చోట్ల మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన పాడి పశువులకు ఏ చిన్న వ్యాధి వచ్చినా, స్థానిక సంచార వైద్య సేవలు లేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి వేలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో సంచార పశు వైద్య వాహనాలు అందుబాటులో లేకపోవడం గ్రామాల్లో పశు సంపదపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

రైతుల డిమాండ్:

పాపన్నపేట మండల వ్యాప్తంగా సంచార పశు వైద్య వాహనాల సేవలను వెంటనే పునరుద్ధరించాలని, ప్రతి గ్రామానికి క్రమం తప్పకుండా వాహనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని పశు పోషకులు పశుసంవర్ధక శాఖ అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. సమయానికి వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచి మూగజీవాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాడు కాంగ్రెస్ హయాంలో SIR(సర్)..నేడు అదే విధానంపై వ్యతిరేక స్వరం.!

కాంగ్రెస్ పాలనలోనూ జరిగిన సమగ్ర సవరణలు..

ఇప్పుడు వ్యతిరేకత వెనుక కారణాలేమిటి.?

ఓటరు జాబితాల ప్రక్షాళన'పై రాజకీయ రగడ..

అసలు వివాదం ఏమిటి.?

ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వచ్ఛమైన ఓటరు జాబితాలు అవసరం.. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదు.!



ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం:/

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఈ హక్కు సక్రమంగా అమలుకావాలంటే ఓటరు జాబితాలు కూడా పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండాలని, ఈ లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియే SIR (Special Intensive Revision). అయితే దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారిందని విశ్లేషకుల అభిప్రాయం. కాంగ్రెస్ పాలనలోనూ ూ×= తరహా ప్రక్రియలు!

SIR అనేది బీజేపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం కాదని, భారత ఎన్నికల సంఘం అధికారిక రికార్డుల ప్రకారం 1952–1956, 1957, 1961, 1965––66, 1983–84, 1987–89, 1992–95, 2002–04 మధ్య ఎనిమిది ప్రధాన దశల్లో సమగ్ర ఓటరు జాబితా సవరణలు నిర్వహించిందని, వీటిలో ఏడు దశలు కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాల కాలంలో జరిగాయని, చివరి దశ 2002––04లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో జరిగింది అని చెప్పవచ్చును. అప్పట్లో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన అవసరమని భావించి ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను నిర్వహించడం జరిగింది. మరి గతంలో జరిగినప్పుడు ఇదే ప్రక్రియపై అభ్యంతరాలు ఎందుకు లేవని? ఇప్పుడు



నిర్వహిస్తుంటే రాజకీయ వివాదాలు ఎందుకు పెరుగుతున్నాయని? అనేది ప్రజల్లో, రాజకీయ విశ్లేషకుల్లో చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చును.

SIR ఎందుకు అవసరం?

ఒక వ్యక్తి మరణించినప్పటికీ ఓటరు జాబితాలో పేరు కొనసాగితే, ఒకే వ్యక్తి రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదైతే, శాశ్వతంగా వేరే ప్రాంతానికి వెళ్లిపోయినా పాత ప్రాంతంలో పేరు కొనసాగితే ఓటరు జాబితా విశ్వసనీయత దెబ్బతింటుందని, అలాగే 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని, అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు అందుబాటులో ఉండాలనేది సర్ ప్రధాన ఉద్దేశం. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఇంటింటి పరిశీలనతో ఓటరు వివరాలను ధ్రువీకరించడం SIR ప్రధాన ఉద్దేశమని, ఎన్నికల సంఘం అభిప్రాయం ప్రకారం గత రెండు దశాబ్దాల్లో పట్టణీకరణ, వలసలు, మరణాలు, చిరునామాల మార్పులు పెరగడంతో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన తక్షణ అవసరమైందని చెప్పకనే చెప్పవచ్చును.

కాంగ్రెస్, ప్రతిపక్షాల అభ్యంతరాలు ఏమిటి?

సర్'ను కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడానికి ప్రధాన కారణం అర్హులైన పౌరుల ఓటు హక్కుకు నష్టం కలగవచ్చనే ఆందోళన, ముఖ్యంగా పేదలు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు అవసరమైన పత్రాలను సమర్పించలేకపోతే వారి పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు చెబుతున్నాయని, అలాగే ఎన్నికల సంఘం వ్యవహారశైలి, పౌరసత్వ అర్హతల పరిశీలన, ప్రక్రియలో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఈ అభ్యంతరాలన్నింటినీ రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం కూడా సరికాదని, అర్హులైన ఒక్క పౌరుడి ఓటు హక్కు కూడా పొరపాటున తొలగిపోకుండా తగిన రక్షణలు ఉండాలని, అదే సమయంలో అనర్హమైన నమోదులను కొనసాగించడం కూడా ప్రజాస్వామ్య ప్రయోజనాలకు విరుద్ధమే అని విశ్లేషకుల నుంచి వినబడుతున్న మాట.

బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వ వాదన ఏమిటి.?

కేంద్రంలోని బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు మద్దతు తెలుపుతోంది, ఎన్నికల్లో ఓటు వేసే హక్కు భారత పౌరులకు మాత్రమే ఉండాలని, ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు వేయకుండా చూడాలని, మరణించిన వారి పేర్లు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోందని చెప్పవచ్చును. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం గతంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన సమగ్ర ఓటరు జాబితా సవరణలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు ఇదే ప్రక్రియను వ్యతిరేకించడం ఎందుకని ప్రతిపక్షాలను ప్రశ్నిస్తున్నారు. అయితే సర్ ను అమలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాదని, రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికల సంఘానిదే ప్రధాన బాధ్యత. కాబట్టి ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించడం అత్యంత ముఖ్యమని చెప్పవచ్చును.

సుప్రీంకోర్టు పరిశీలన.. రాజ్యాంగబద్ధతపై చర్చ!

ఎస్.ఐ.ఆర్.పై న్యాయపరమైన చర్చ కూడా కొనసాగుతోంది. 2026 మే 27న సుప్రీంకోర్టు ఎస్.ఐ.ఆర్. నిర్వహణ ఎన్నికల సంఘం చట్టబద్ధ అధికార పరిధిలో ఉందని పేర్కొన్నట్లు కేంద్ర న్యాయశాఖ వెల్లడించడం జరిగింది. మరోవైపు అమలు విధానం, పారదర్శకతకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలపై న్యాయపరమైన పరిశీలన కొనసాగుతోంది.

రాజకీయాలకు అతీతంగా ఆలోచించాల్సిన సమయం.!

ఓటరు జాబితాల ప్రక్షాళన అనేది ఒక పార్టీకి అనుకూలం, మరో పార్టీకి వ్యతిరేకం అనే కోణంలో మాత్రమే చూడాల్సిన అంశం కాదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలోనూ జరిగిన ఈ ప్రక్రియను ఇప్పుడు రాజకీయ వివాదంగా మార్చడం వల్ల అసలు లక్ష్యం మరుగున పడకూడదని, ఎస్.ఐ.ఆర్. ద్వారా మరణించిన వారి పేర్లు తొలగాలి, నకిలీ, బహుళ నమోదులు సరిచేయాలి, అర్హులైన యువతకు ఓటు హక్కు కల్పించాలి, అదే సమయంలో ముఖ్యంగా పేదలు, వలస కార్మికులు, నిరుపేద కుటుంబాలకు చెందిన అర్హులైన భారతీయ పౌరుల పేర్లు ఎలాంటి పొరపాట్ల వల్లా తొలగిపోకూడదని, ప్రజాస్వామ్యానికి స్వచ్ఛమైన ఓటరు జాబితా ఎంత అవసరమో, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడటం కూడా అంతే అవసరమని, రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలకు పరిమితం కాకుండా, ఎన్నికల సంఘం పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేసేలా సహకరించాలని, ఎందుకంటే ప్రజాస్వామ్యానికి అసలైన బలం రాజకీయ పార్టీలు కాదని, ప్రజల ఓటు హక్కని, ఆ ఓటు హక్కు'పై ఉండే విశ్వాసం అని విమర్శకులు గుర్తెరుగాలని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

అచ్చునూరి కిషన్ ముదిరాజ్.
ప్రజా వాయిస్ ములుగు జిల్లా బ్యూరో చీఫ్.
ఫోన్: +91 9000986761.

